## మహాకుంభమేళాలో మరో అగ్నిప్రమాదం

యూపీలో జరుగుతున్న ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహా కుంభమేళాలో మరోసారి అగ్నిప్రమాదం సంభవించింది. సెక్టార్-18 శంకరాచార్య మార్గంలోని ఓ గుడారంలో మంటలు చెలరేగాయి. మంటల కారణంగా ఆ ప్రాంతంలో దట్టమైన పొగ అలుముకుంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ సర్వేశ్ కుమార్ జాతీయ మీడియాకు తెలిపారు. కాగా కొద్ది రోజుల క్రితం సెక్టార్ -22 లో గ్యాస్ సిలిండర్లు పేలడం వల్ల అక్కడ అగ్నిప్రమాదం సంభవించిన సంగతి తెలిసిందే. మరోవైపు జనవరి 13నుంచి కొనసాగుతున్న మహాకుంభమేళా అధికారికంగా ఫిబ్రవరి 26న ముగియనున్నది. గురువారం నాటికి 39 కోట్ల మంది భక్తులు కుంభమేళాను సందర్శించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :298 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 08-02-2025 | పేజీలు:4 వెల: 2.00

## కామారెడ్డి ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు..



హైదరాబాద్,పార్టీ ఫిరాయింపులపై కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఫిరాయింపుల మీద మాట్లాడుతున్న వారు ఇద్దరూ దొందు దొందే అని విమర్శించారు.ప్రభుత్వానికి ధైర్యం ఉంటే రాజీనామా చేసి పోటీకి వెళ్ళాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఫిరాయింపుల ఎమ్మెల్యేలతో రాజీనామా చేసి తిరిగి పోటీ చేయాలని తెలిపారు. పార్టీ మారినప్పుడు రాజీనామా చేస్తేనే వారు మొగోళ్ళు లేదంటే ఆడంగులేనని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాజీనామా చేసిన వారు పోటీ చేస్తేనే వారు నిజమైన లీడర్లు అని వెంకట రమణారెడ్డి అన్నారు. పార్టీ మార్పిడిలు తప్పుడు నిర్ణయమని ఆయన తెలిపారు.మరోవైపు.. రాష్ట్రంలో నలభై శాతం మించి రుణమాఫీ జరగలేదని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. పక్కింటి కుటుంబ సమస్యలను నోటికి వచ్చే విధంగా మాట్లాడే మంత్రులు ఉన్నారని ఆరోపించారు. కులగణన రాజకీయ గణన మాత్రమే నన్నారు. ఇదిలా ఉంటే.. మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డిల మైండ్ సెట్ ఒకటేనని పేర్కొన్నారు. తమకు ప్రభుత్వాన్ని కూలగొట్టే అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రభుత్వం కూలగొట్టే ఓపిక తమకు లేదన్నారు. అవిశ్వాసం అనేది ఒక ఎమ్మెల్యే మాట.. అది పార్టీ నిర్ణయం కాదని తెలిపారు. ప్రజల అసంతృప్తిని తాము ఎండగడుతామని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు.

## ఆ 39 లక్షల మంది ఓటర్లు ఎక్కడి నుంచి వచ్చారు..?

న్యూఢిల్లీ, కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై లోక్‌సభ లో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం తీరుతో మహారాష్ట్ర ఓటర్ల జాబితాల్లో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలప్పుడు లేని 39 లక్షల మంది ఓటర్ల పేర్లు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలప్పుడు జాబితాల్లోకి వచ్చాయని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కేవలం ఐదు నెలల వ్యవధిలో ఆ 39 లక్షల మంది ఓటర్లు ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు.దేశ రాజధాని ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఉద్ధవ్ థాకరే శివసేన ఎంపీ సంజయ్ రౌత్, శరద్ పవార్ ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలేతో కలిసి ఏర్పాటు చేసిన జాయింట్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రాహుల్‌గాంధీ మాట్లాడారు. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల కంటే ముందు ఐదేళ్ల కాలంలో పెరిగిన ఓటర్లకు సమానంగా కేవలం గత ఐదు నెలల్లోనే పెరిగారని, ఇది ఎలా జరిగిందో ఎన్నికల సంఘం చెప్పాలని ఆయన ప్రశ్నించారు.అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం విచ్చలవిడిగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో చేర్చారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ విషయంలో ఎన్నికల సంఘం అధికార కూటమికి అనుకూలంగా వ్యవహరించిందని విమర్శించారు. దాంతో మహారాష్ట్రలో ఓటర్ల సంఖ్య ఆ రాష్ట్ర జనాభాను మించిపోయిందని వ్యాఖ్యానించారు. ఐదు నెలల్లో



పెరిగిన ఓటర్ల సంఖ్య ఇంచుమించుగా హిమాచల్ ప్రదేశ్ జనాభాకు సమానమని అన్నారు.ఈ కొత్త ఓటర్లంతా ఎక్కడి నుంచి వచ్చారని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. వారంతా ఎవరని నిలదీశారు. మహారాష్ట్ర ఓటర్ల జాబితాను ప్రతిపక్ష పార్టీలు క్షుణ్ణంగా అధ్యయనం చేశాయని, ఈ అధ్యయనం ద్వారా ఓటర్ల జాబితాలో అనేక అక్రమాలు జరిగినట్లు తేలిందని చెప్పారు. అందుకే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపడ్డ ప్రతిపక్ష పార్టీలన్నీ ఒక్క తాటిపైకి వచ్చి ప్రశ్నిస్తున్నాయని, ఎన్నికల సంఘం సమాధానం చెప్పి తీరాలని ఆయన డిమాండ్ చేశారు.

## వైఎస్సార్‌సీపీలోకి మాజీ మంత్రి శైలజానాథ్

తాడేపల్లి: వైఎస్సార్‌సీపీలోకి మాజీ మంత్రి సాకే శైలజానాథ్ చేరారు. ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలోకి చేరారు. కండవా కప్పి పార్టీలోకి వైఎస్ జగన్ ఆహ్వానించారు. శైలజానాథ్‌తో పాటు ఏఐసీసీ మెంబర్, అనంతపురం డీసీసీ మాజీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు.

వైఎస్ జగన్ రాజకీయ విధానాలు నచ్చటం వల్లే..

ఈ సందర్భంగా శైలజానాథ్ మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్ జగన్ నాయకత్వంలో పనిచేయడానికి సిద్ధమన్నారు. ప్రజల తరుపున వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు. వైఎస్ జగన్ రాజకీయ విధానాలు నచ్చటం వల్లే వైఎస్సార్‌సీపీలోకి చేరానని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను అవలంబిస్తోందని.. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చటం లేదని శైలజానాథ్ అన్నారు."ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తుంది. రాయలసీమలో ప్రజల కష్టాలు తీర్చేందుకు నా వంతు పనిచేస్తా.. రాజకీయాలు ప్రజా ప్రయోజనాల కోసం చేయాలే కానీ ఆర్థిక ప్రయోజనాల కోసం కాదు. కాంగ్రెస్ నుంచి మరికొందరు నేతలు వచ్చే అవకాశం ఉంది. ఎవరెవరు వస్తారనేది ఇప్పుడే చెప్పలేం. జగన్ ఏ బాధ్యత అప్పగించినా నా శక్తి మేరకు పనిచేస్తా" అని శైలజానాథ్ చెప్పారు. ఈ కార్యక్రమం



లో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత వెంకట్రామిరెడ్డి, వేంపల్లి సతీష్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.విశ్వేశ్వర రెడ్డి, తలారి రంగయ్య, మేరుగ నాగార్జున, పలువురు నాయకులు పాల్గొన్నారు.కాగా, అనంతపురం జిల్లాకు చెందిన శైలజానాథ్ శింగనమల నియోజకవర్గం నుంచి 2004, 2009లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలుపొందారు. ఉమ్మడి ఏపీలో మంత్రిగా పనిచేశారు. 2022లో ఏపీసీసీ అధ్యక్షుడిగా కూడా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు.

## బీసీ కులగణన.. కాంగ్రెస్ కుట్ర..



నిజామాబాద్ : బీసీ కులగణన పేరుతో కాంగ్రెస్ ఒక పెద్ద కుట్ర అని ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ అన్నా రు. బీసీలకు అన్యాయం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చడం ఖాయమని నొక్కి చెప్పారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ%ూ% తెలంగాణ ప్రభుత్వం కులగణన గొప్పగా చేసాము, మా అంత గొప్ప పార్టీ, గొప్ప నాయకులు దేశంలో ఎవరూ లేరన్నట్టు అసెంబ్లీలో తీర్మానం పెడుతున్నామని బీసీ వర్గం ప్రజలను మోసం చేసే కుట్ర అసెంబ్లీలో జరిగిందన్నారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీ ఓట్ల కోసం కాంగ్రెస్ చేసిన పెద్ద డ్రామా అని ఆరోపించారు. గత ప్రభుత్వం లెక్కల ప్రకారం 1.85 కోట్లకు పైగా అంటే 51 శాతం ఉంటే.. ఇప్పుడు కాంగ్రెస్ లెక్కల ప్రకారం 1.65 కోట్లు అంటే 46.25 శాతం నిర్ణయించిందని, మరి దాదాపు 21లక్షల బీసీలు ఏమైనారని ప్రశ్నించారు. బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలనేదానికి తాము వ్యతిరేకం కాదని, కానీ బీసీ కులగణన పేరుతో మైనారిటీ వర్గాన్ని బీసీలో కలిపే కుట్ర చేసినట్లు తమకు అనుమానం వస్తుందన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో రూ.50కోట్లతో బీసీ కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఒక్క దానికైనా కనీసం శంకుస్థాపన చేసారా అని ప్రశ్నించారు. బీసీలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చకుంటే రేవంత్ సర్కార్ ను బీసీ బిడ్డలు కూల్చడం ఖాయమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, మాజీ ఫ్లోర్ లీడర్స్ రేవంత్ రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు అండగా ఉంటానని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు. అంతేకాకుండా తన ట్రస్ట్ నుంచి ఆర్థిక సాయం అందజేస్తానని బాధితులకు భరోసా కల్పించారు. నగరంలోని కోటగల్లీ మార్కెండేయ ఆలయ సమీపంలో మధి ర ప్రసాద్, సుమలత నివసిస్తున్న ఇండ్లలో ఇంట్లో వెలిగించిన దీపం కారణంగా ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు ఇండ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న అర్బన్ ఎమ్మెల్యే సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. తన ట్రస్ట్ ద్వారా స్వంతంగా బాధిత కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చారు.వెంటనే ఆర్డీవోతో ఫోన్ లో మాట్లాడి బాధితులకు పునరావాస కల్పన, ప్రభుత్వం నుండి రావాలిసిన సహాయ సహకారాలు వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా కలెక్టర్ తో మాట్లాడి ఇళ్ళ నిర్మాణానికి ప్రభుత్వం నుండి వచ్చే ఇందిరమ్మ ఇళ్ళు రూ.5లక్షల ఆర్థిక సహాయం కూడా అందేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, బీజే వైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్నాటి కార్తీక్, జగన్, ఆనంద్, మఠం పవన్, మున్నా, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## లెక్కింపు సమయంలో ప్రతి ఈవీఎం నుండి ఓట్లు ఎందుకు తీసివేస్తారు..



న్యూఢిల్లీ,ఢిల్లీ అసెంబ్లీ 2025 ఎన్నికలకు ఫిబ్రవరి 5న ఓటింగ్ జరిగింది. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరిగింది. ప్రస్తుతం 24 గంటల్లోపే ఢిల్లీలో ఎవరు అధికారాన్ని కైవసం చేసుకుంటారో స్పష్టమవుతుంది.ఆమ్ ఆద్మీ పార్టీ హ్యాట్రిక్ విజయాలు సాధిస్తుందా లేదా చాలా కాలం తర్వాత బిజెపి తిరిగి అధికారంలోకి వస్తుందా? ఎగ్జిట్ పోల్స్‌ను పరిశీలిస్తే, కాంగ్రెస్ ఎక్కడా రేసులో ఉన్నట్లు అనిపించడం లేదు.ఓట్ల లెక్కింపు రేపు అంటే ఫిబ్రవరి 8న జరుగుతుంది. ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయో, ఏ పార్టీ ఏ సీటును గెలుచుకుందో ప్రకటిస్తారు. ఈవీఎం ద్వారా ఓటింగ్ జరిగినప్పుడు ఓట్ల లెక్కింపు చాలా త్వరగా పూర్తవుతుంది. తరువాత ముందుగా దాని నుండి కొన్ని ఓట్లను తీసివేస్తారు. ఇలా ఎందుకు చేస్తారో ఈ కథనంలో తెలుసుకుందాం.

లెక్కింపు సమయంలో ఈవీఎంల నుండి ఓట్లను ఎందుకు తీసివేస్తారు?

భారతదేశంలో ఓటు వేయడానికి ఈవీఎంలను ఉపయోగిస్తారు. ఈవీఎం ద్వారా ఓటింగ్ ప్రక్రియ సులభంగా జరుగుతుంది. అలాగే లెక్కింపు కూడాను. కానీ ఈవీఎంలను ఉపయోగించి ఓట్ల లెక్కింపు జరిగినప్పుడు వాటిలో కొన్ని ఓట్లు తగ్గుతాయి. అలా ఎందుకు జరుగుతుందని ఆలోచిస్తున్నారా.. ఇది ఎన్నికల సంఘం నిబంధనల పరిధిలో జరుగుతుంది.వాస్తవానికి ఈవీఎంల తో ఓటింగ్ ప్రారంభం అయినప్పుడు దానికి ముందు ఈవీఎం యంత్రం సరిగ్గా పనిచేస్తుందో లేదో నిర్ధారించుకుంటారు. ఈ కారణంగా ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు మొదట తమ ఓటును వేసి, ఆ తర్వాత చెక్ చేస్తారు. ఎక్కువ మంది అభ్యర్థులు ఉంటే, యంత్రం సరిగ్గా పనిచేస్తుందో లేదో తనిఖీ చేయడానికి ప్రతి ఒక్కరి ముందు ఉన్న బటన్‌ను నొక్కితే సరిపోతుంది. లెక్కింపు జరిగినప్పుడు ఈ ఓట్లను రీసెట్ చేయలేము. అప్పుడు ఆ కాలంలో ఇవి తగ్గుతాయి.భారత ఎన్నికల సంఘం ద్వారా అన్ని పోలింగ్ బూత్‌లకు ఫారం 17%జ% జారీ చేస్తారు. ఓటింగ్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఈ ఫారంలో నమోదు చేయాలి. ఈవీఎం యంత్రాన్ని టెస్ట్ చేసే సమయంలో ఎన్ని ఓట్లు పడ్డాయి.. ఏ పార్టీ అభ్యర్థులకు ఎన్ని ఓట్లు వేశారో కూడా ప్రస్తావించాల్సి ఉంటుంది.

## రాష్ట్ర మంత్రుల పనితీరుపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

అమరావతి,ఫిబ్రవరి7: రాష్ట్ర మంత్రులను పనితీరును ఉద్దేశిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. వేగవంతమైన పనితీరుతో సత్వర ఫలితాలు సాధిద్దామంటూ మంత్రులకు సూచించారు ముఖ్యమంత్రి. ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రజలు అపారమైన నమ్మకంతో 2024 ఎన్నికల్లో 93 స్ట్రైక్ రేట్‌తో చారిత్రాత్మక తీర్పును ఇచ్చి గెలిపించారని తెలిపారు. వారి ఆశల్ని, ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు తొలిరోజు, తొలిగంట నుంచి ప్రయత్నం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు యశక్తులా కష్టపడుతున్నామన్నారు. పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్, అన్న క్యాంటీన్లు వంటి పథకాలతో సంక్షేమం అమలు చేస్తూనే... మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల సాధనతో అభివృద్ధివైపు అడుగులు వేస్తున్నామన్నారు. ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని సుపరిపాలనతో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని.. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. అయితే ఈ లక్ష్యాలను వేగంగా చేరుకోవాలంటే ప్రభుత్వంలో ఉన్న ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు. "టీమ్ వర్క్‌గా పని చేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలమని నేను విశ్వసిస్తాను. అసాధారణ, వేగవంతమైన పనితీరు చూపితే తప్ప... విధ్వంస రాష్ట్రంలో పునర్నిర్మాణ ఫలితాలను ప్రజలకు చూపలేం. అందుకే ఎప్పటికప్పుడు ప్రతి ఒక్కరు టీం స్పిరిట్‌తో పనితీరుపై సమీక్షించుకుని పనిచేయాలన్నదే మా ఆలోచన. అందులో భాగంగానే ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రులకు ర్యాంకులు ఇచ్చాం. దస్త్రాల పరిష్కారంలో నిన్న విడుదల చేసిన ర్యాంకులు ఎవరినీ ఎక్కువ చేయడానికి కాదు.. ఎవరినీ తక్కువ చేయడానికి కాదు. ఎవరు ఏ స్థానంలో ఉన్నారనేది చెప్పడం ద్వారా తమతో తాము పోటీ పడటంతో పాటు, ఒకరితో ఒకరు పోటీ పడి పనిచేయడానికి, పాలనలో వేగం పెంచేందుకు చేసిన ప్రయత్నమే ఇది. ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో నేను కూడా నా స్థానాన్ని మరింత మెరుగుపరుచుకోవాల్సి ఉంది 'పీపుల్ ఫస్ట్' విధానంతో నేను, నా కేబినెట్ సహచర మంత్రులంతా పనిచేస్తున్నాము. లక్ష్యాల సాధనకు అడుగులు వేస్తున్నాము. గ్రామ స్థాయిలో చిరు ఉద్యోగి నుంచి సీఎం వరకు అంతా కష్టపడి సమిష్టిగా పనిచేస్తేనే ప్రజల సమస్యలు, కష్టాలు తీర్చి... సమస్యల సుడిగుండంలో ఉన్న రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టగలం. ప్రతి ఒక్కరూ



సానుకూల దృక్పథంతో శాఖల్లో అత్యున్నత ప్రతిభ చూపిస్తారని ఆశిస్తున్నాను" అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. కాగా.. నిన్న ఏపీ కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులతో సీఎం చంద్రబాబు విడిగా సమావేశమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంత్రుల ఫైల్స్ క్లియరెన్స్‌పై పెర్ఫార్మెన్స్‌ను సీఎం చదివి వినిపించారు. అలాగే ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రులకు ర్యాంకులు ప్రకటించారు. ఏ మంత్రికి ఏ ర్యాంక్ వచ్చింది.. చివరగా ర్యాంక్ ఎవరికి వచ్చిందనే వివరాలను తెలిపారు సీఎం. మొదటి స్థానంలో ఎన్ఎండీ ఫరూఖ్ ఉండగా.. చివరి స్థానంలో మంత్రి వాసంశెట్టి శుభాష్. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరవ స్థానంలో నిలిచారు. ఇక కందుల దుర్గేష్ 2వ స్థానం, కొండపల్లి శ్రీనివాస్ 3వ స్థానం, నాదెండ్ల మనోహర్ 4వ స్థానం, డోలా బాల వీరాంజనేయులు 5వ స్థానం, సీఎం చంద్రబాబు 6వ స్థానం, సత్యకుమార్ 7వ స్థానం, లోకేష్ 8వ స్థానం, బీసీ జనార్ధన్ రెడ్డి 9వ స్థానం, పవన్ కల్యాణ్ 10వ స్థానం, సవిత 11వ స్థానం, కొల్లు రవీంద్ర 12వ స్థానం, గొట్టిపాటి రవికుమార్ 13వ స్థానం, నారాయణ 14వ స్థానం, టీజీ భరత్ 15వ స్థానం, ఆనం రాంనారాయణరెడ్డి 16వ స్థానం, అచ్చెన్నాయుడు 17వ స్థానం, రాంప్రసాద్ రెడ్డి 18వ స్థానం, గుమ్మడి సంధ్యారాణి 19వ స్థానం, వంగలపూడి అనిత 20వ స్థానం, అనగాని సత్యప్రసాద్ 21వ స్థానం, నిమ్మల రామానాయుడు 22వ స్థానం, కొలుసు పార్థసారథి 23వ స్థానం, పయ్యావుల కేశవ్ 24వ స్థానంలో ఉండగా.. ఇక చివరి 25వ స్థానంలో వాసంశెట్టి సుభాష్ నిలిచారు.

## మళ్లీ దూకుడు పెంచిన హైడ్రా...

హైదరాబాద్,శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రోడ్డులో శుక్రవారం ఉదయం హైడ్రా అధికారులు కూల్చివేతలకు దిగారు. పన్ను కట్టకుండా అక్రమంగా నిర్మించిన ప్రకటనల హోర్డింగ్ పాయింట్స్. అక్రమ హోర్డింగ్‌లను అధికారులు కూల్చివేస్తున్నారు. స్థానిక మున్సిపాలిటీ అధికారుల ఫిర్యాదుతో హైడ్రా చర్యలకు దిగింది. అలాగే శంషాబాద్‌లోని సిద్ధాంతి జాతీయ రహదారి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ ప్రాంతంలోని హోర్డింగ్‌లను తొలగించడానికి హైడ్రా సిబ్బందితో సహా ఇక్కడికి వచ్చి పరిశీలన జరుపుతోంది. మరికొద్ది సేపట్లో కూల్చివేతల ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కాగా కొద్ది రోజులుగా దూకుడు తగ్గించిన హైడ్రా మళ్లీ రంగంలోకి దిగింది. రెండు రోజుల క్రితం శంషాబాద్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు పక్కన ప్రహరీ గోడలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. సర్వే నంబర్లు 601, 602 లో చేపట్టిన ప్రహరీ గోడను కూల్చివేశారు. వివాదాస్పద రోడ్డు స్థలం విషయంలో ఫిర్యాదులు రావడంతో కూల్చివేశారు. అయితే తమ పట్టా భూమిలో తాము నిర్మించుకున్న ప్రహరీ గోడను హైడ్రా అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కూల్చివేసారని బాధితులు మండిపడుతున్నారు. కాగా నిర్మాణరంగ, ఇతర వ్యర్థాల అక్రమ డంపింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని హైడ్రా నిర్ణయించింది. చెరువులు, నాలాలు, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పోసే వాహనాలపై సంస్థ బృందాలు ప్రత్యేక నిఘా పెట్టాయి. పలు ప్రాంతాల్లో అక్రమంగా వ్యర్థాలు డంప్ చేస్తోన్న నాలుగు టిప్పర్లను హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు పట్టుకున్నాయి. ఉందాసాగర్‌లో



వ్యర్థాలు పోస్తోన్న నాలుగు టిప్పర్లు, పోసిన మట్టిని వెంటనే చదును చేస్తోన్న ప్రొక్లెయినర్‌నూ పట్టుకున్నారు. అలాగే కూకట్ పల్లి నిజాంపేట మెయిన్ రోడ్డులో.. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టిన నిర్మాణాలను జేసీబీలతో హైడ్రా అధికారులు కూల్చివేశారు. నిజాంపేట హోలిస్టిక్ ఆస్పత్రి వెనక భాగంలో ఆర్మీ ఉద్యోగికి ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. ఆ స్థలం చుట్టుపక్కల వాళు పెద్ద పెద్ద నిర్మాణాలు చేపట్టారు. ప్రహరీగోడలు కట్టేశారు.కొన్నేళ్లుగా ఈ విషయంపై ఆర్మీ ఉద్యోగి పోరాటం చేస్తున్నా ఎలాంటి ఫలితం లేదు.ఈ క్రమ ంలో ఆర్మీ ఉద్యోగి ఆధారాలతో సహా హైడ్రాకు ఫిర్యాదు చేశారు.దీంతో విచా రణ చేపట్టిన అధికారులు.. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని నిర్ధారించి.. గురువారం జేసీబీలతో అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఆర్మీ ఉద్యోగికి స్థలాన్ని అప్పగించారు.

## సంపాదకీయం

**శనివారం 08-02-2025**

# సావర్కర్ నిజస్వరూపం

ప్రస్తుత కేంద్ర పాలకులకు సిద్ధాంత దైవం వి.డి.సావర్కర్. ఈయన చెప్పిన హిందుత్వ సిద్ధాంతం ఆధారంగా హిందూ రాజ్యం నిర్మించాలని ఆర్ఎస్ఎస్ ఉవ్విళ్ళూరుతున్నది. కేంద్రంలో వున్న అధికారాన్ని ఉపయోగించుకుని అందుకు వేగంగా సిద్ధపడుతుంది. ఈ సంవత్సరానికి ఆర్ఎస్ఎస్ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తవుతున్నందున ఆ సంస్థతో పాటు, దాని అధినేతల గురించి అనేక కల్పిత గాధలతో ప్రచారాన్ని హోరెత్తించనున్నారు. సరిగ్గా ఈ సమయంలో సావర్కర్ నిజరూపాన్ని 'ది న్యూ ఐకాన్ : సావర్కర్ అండ్ ఫాక్ట్స్' అనే 550 పేజీల పుస్తకంలో సీనియర్ జర్నలిస్టు అరుణ్ శౌరి స్కాన్ చేశారు. గాంధీజీ హత్య గావించబడిన రోజునే ఆ కేసులో ముద్దాయిగా వున్న సావర్కర్ గురించిన పుస్తకం ఆవిష్కరించడం మరింత ప్రాధాన్యత కలిగించింది. ఈ అరుణ్ శౌరి ఆర్ఎస్ఎస్ వ్యతిరేకో, కమ్యూనిస్టు అభిమానో కాదు. కరడుగట్టిన హిందూత్వవాది. 1998-2004 మధ్య వాజ్‌పేయి ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆర్ఎస్ఎస్ భావజాల వ్యాప్తి కోసం కల్పిత చరిత్రను సృష్టించిన సీతారాం గోయల్ 'హిందూ దేవాలయాలు-వాటికి ఏం జరిగింది?' అనే పుస్తకం ఆధారంగా అయోధ్య బాబ్రీ మసీదు వివాదాన్ని రగిలించడంలో కీలకంగా పని చేసిన జర్నలిస్టు ఈ అరుణ్‌శౌరి. 'ది ఇలస్ట్రేటెడ్ వీక్లీ' పత్రికలో కమ్యూనిస్టుల మీద నిందా ప్రచారాన్ని చేసిన ఆర్ఎస్ఎస్ వాది. జీవిత కాలమంతా పాపాలు చేసి చివరి రోజుల్లో గంగానది స్నానానికి వెళ్లినట్లు శౌరి తన చివరి రోజుల్లో ఈ పరిశోధనాత్మక పుస్తకాన్ని రాశారు. స్వాతంత్ర్య పోరాటంలో చిత్రహింసలను, ధన, మాన, ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన వీరయోధుల స్థానంలో బ్రిటీష్ వారి క్షమాభిక్షను 'అడుక్కుని', వారు ఇచ్చే ముష్టి పింఛను కోసం దేబిరించిన వారి చిత్రపటాలను పార్లమెంట్ హాల్‌లో ప్రతిష్టించుకుంటున్న రోజుల్లో మనం జీవిస్తున్నాం. దేశ విభజనకు మూల బీజాన్ని నాటిన వ్యక్తి పేరు అంతర్జాతీయ విమానాశ్రయాలకు పెట్టిన పాలకుల ఏలుబడిలో ప్రస్తుతం మనం వున్నాం. మహాత్ముడు పాపాత్ముడు అవుతున్నాడు. దేశద్రోహమే దేశభక్తి అయిపోతున్నది. ఈ పరిస్థితుల్లో అరుణ్ శౌరి రాసిన ఈ పుస్తకం లోని అంశాలను విద్యార్థులు, మేధావులు, ప్రజాతంత్రవాదులు విస్తృతంగా చర్చించాలి. వినాయక దామోదర్ సావర్కర్ గురించి ప్రచారంలో వున్న కొన్ని కీలకమైన అంశాల వాస్తవికతను రచయిత ఈ పుస్తకంలో వివరించారు. తాను చెప్పిన అంశాలకు వందల ఆధారాలను ఈ గ్రంథంలో చూపారు. ఫ్రాన్స్ సముద్ర జలాల్లో మెరిసిల్స్ వద్ద ఓడ నుండి సావర్కర్ తప్పించుకున్నారా? సావర్కర్, గాంధీలు లండన్‌లో స్నేహితులుగా కలిసి ఉన్నారా? అండమాన్‌లో జైలు అధికారుల వల్లే సావర్కర్ ముస్లిం వ్యతిరేకిగా మారారా? బ్రిటిష్ ప్రభుత్వానికి ఆయన క్షమాభిక్ష కోరుతూ పెట్టుకున్న దరఖాస్తులలో ఏముంది? క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో బ్రిటీష్ వారికి సహాయ సహకారాలు అందించారా? నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు సావర్కర్ మార్గదర్శా? హిందూత్వం గురించి, మత విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, గోవుల గురించి సావర్కర్ ఏం చెప్పారు? సావర్కర్ నిర్మించదలచుకున్న హిందూ రాజ్యం ఎటువంటిది? వీటికి సమాధానాలు వెదికారు. ప్రస్తుత పాలకుల మతతత్వ విధానాల ప్రమాదాన్ని హెచ్చరించారు.

### వి.డి. సావర్కర్ ఎవరు?

స్వాతంత్ర్యోద్యమంలో మతం ఆధారంగా ప్రజల మధ్య ఐక్యతను విభజించిన ముస్లింలీగు, హిందూ మహాసభలు వివిధ సందర్భాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సామ్రాజ్యవాదానికి తోడ్పడ్డాయి. సావర్కర్ 1937లో హిందూ మహాసభకు అధ్యక్షుడై ఏడు పర్యాయాలు ఆ పదవిలో ఉన్నాడు. ద్విజాతి సిద్ధాంతాన్ని మొట్టమొదట ప్రతిపాదించింది ఈయనే. అదే ఆ తర్వాత దేశ విభజనకు కారణమైంది. 1909లో కర్జన్ విల్లి అనే బ్రిటీష్ భారత ఆర్మీ అధికారి హత్యను ప్రోత్సహించడంతో పాటు, మరో రెండు హత్య కేసుల్లో అనుమానాస్పదుడు. అండమాన్ జైల్లో ఉన్న రోజుల్లో 1911, 1913, 1917 సంవత్సరాల్లో క్షమాభిక్ష పెట్టాలని బ్రిటీష్ అధికారులను రాతపూర్వకంగా వేడుకున్నాడు. 1948 జనవరి 30న గాడ్సే కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన గాంధీజీ హత్య కేసులో ఆయన ముద్దాయి. ఈయన రాసిన 'ఎసెన్షియల్స్ ఆఫ్ హిందుత్వ' గ్రంథం నేటి ఆర్ఎస్ఎస్‌కు, బిజెపి కి ప్రాణవాయువు.

### అరుణ్ శౌరి పుస్తకంలో ఏముంది?

మొదటి భాగంలో 'సావర్కర్ గురించి మరింత తెలుసుకుందాం' అనే శీర్షిక కింద సావర్కర్ "గోవు" ఆరాధకుడు కాదని, అంతేకాక గొడ్డు మాంసం తినడానికి ఆయన వ్యతిరేకం కాదని, వ్యవసాయానికి అవసరమైన పశుసంపదకు కారణం ఆవు కనుక దాన్ని గౌరవించడం తప్పు కాదు కానీ ఆవుకు ఒక పవిత్రతను అంటగట్టడం సరికాదని సావర్కర్ చెప్పినట్లు శౌరి ఈ భాగంలో చెప్పారు. గో మూత్రం, గో పేడ, గో సంరక్షణ పేరుతో నేటి పాలకులు, ఆర్ఎస్ఎస్ చేస్తున్న ప్రచారం, ఇతర మతస్తులపై దాడి ఆవుపై గౌరవంతోనో, భక్తితోనో కాదని దాని వెనుక మతతత్వ ఎజెండా వుందని శౌరి చెప్పారు. సావర్కర్ గొప్పదనం గురించి ఆర్ఎస్ఎస్ చేస్తున్న ప్రచారం 'చరిత్ర కల్పితం' అనే రెండో భాగంలో చరిత్ర ఆధారాలతో శౌరి చర్చించారు. చిత్రగుప్త పేరుతో రాయబడిన 'లైఫ్ ఆఫ్ బారిస్టర్ సావర్కర్' పుస్తక రచయిత సావర్కరేనని శౌరి తేల్చారు. తన చరిత్రను మారు పేరుతో రాసుకుని అందులో అనేక కల్పితాలను సృష్టించారని ఆయన ఆరోపించారు. 'ది రివల్యూషనరీ రైట్స్' అనే మరో భాగంలో సావర్కర్ తనను తాను శివాజీతో పోల్చుకోవడాన్ని శౌరి హేళన చేస్తారు. 'శివాజీ ఆటంకాలను అధిగమించి తన పోరాటాన్ని కొనసాగించాడు. సావర్కర్ మాత్రం బ్రిటీష్ వారికి పెట్టుకున్న క్షమాభిక్ష విజ్ఞాపన ప్రకారం వారికి ఉపయోగపడ్డాడు. రెండు దేశాల సిద్ధాంతాన్ని ప్రతిపాదించి బ్రిటీష్ వారికి ఎల్లవేళలా ఉపయోగపడ్డాడు. సావర్కర్ గాంధీజీపై అనేక అవమానకరమైన విమర్శలు, దూషణలు చేశాడు' అని శౌరి చెప్పారు. 1911లో సావర్కర్ అండమాన్ సెల్యులార్ జైలులో ఆరు నెలలు శిక్ష అనుభవించి బ్రిటీష్ అధికారులకు క్షమాభిక్ష కోరుతూ లేఖ రాసుకున్నాడు. 1913లో మరోసారి లేఖ రాస్తూ 'భారతదేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రభుత్వం రాజీ విధానంతో మరోసారి ముందుకొచ్చింది. మానవత్వం ఉన్న ఏ మనిషి అయినా%ఔ% ముళ్ళ దారిని కోరుకోడు.' అంటూ 'నేను మీకు అవసరమైన ఏ పదవినిచ్చినా ప్రభుత్వానికి సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నాను' అని చెప్పుకున్న వ్యక్తి సావర్కర్. సుభాష్ చంద్రబోస్, మహాత్మా గాంధీల గురించి సావర్కర్ అబద్ధం చెప్పాడని, 1908లో గాంధీ లండన్‌లో వున్నప్పుడు సావర్కర్ అక్కడకు వెళ్లనేలేదని అలాంటప్పుడు గాంధీతో లండన్‌లో స్నేహం ఎలా ఏర్పడిందని ప్రశ్నించారు. భారతదేశం నుండి పారిపోవాలని, ఇండియన్ నేషనల్ ఆర్మీని ఏర్పాటు చేయాలని, హిందూస్థాన్‌కు పూర్తి స్వాతంత్ర్యం ప్రకటించాలని సావర్కర్ సుభాష్ చంద్రబోస్‌కు చెప్పాడనేది పూర్తిగా కల్పితమని అరుణ్ శౌరి చెప్పారు. 1920లో ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ కార్మికుల, రైతుల, సామాజిక సమస్యలను జాతీయోద్యమ ఎజెండాగా మలచింది. 1920-25 మధ్య మూడు పెద్ద కుట్ర కేసులను ఆ పార్టీ నాయకులు ఎదుర్కొన్నారు. అప్పటి వరకు జాతీయ కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరిని మార్చుకుని పూర్తి స్వాతంత్ర్యాన్ని డిమాండ్ చేసింది.

# మణిపూర్ అల్లర్ల వెనుక ఏం జరిగింది?





మణిపూర్,మణిపూర్ అల్లర్లు.. ఈ దేశం ఇప్పుడప్పుడే మర్చిపోలేని ఘోరమైన సంఘటన. రెండు జాతుల మధ్య రేగిన వైరం.. ఎంతటి హింసకు దారితీసిందో.. అంతా చూశాం. ఇప్పటికీ.. ఇదే విషయంలో మణిపూర్ రగులుతూనే ఉంది. మెయితీలు, కుకీల మధ్య హింసను ప్రేరేపించడం వెనుక.. సీఎం బీరెన్ సింగ్ ఉన్నారనే ఆరోపణలు ఇప్పుడు సంచలనంగా మారాయి. దీనికి సంబంధించిన ఆడియో క్లిప్ లీక్ అవడం.. హాట్ టాపిక్‌గా మారింది. అసలు.. మణిపూర్ అల్లర్ల వెనుక ఏం జరిగింది?ఇప్పుడు.. దేశం మొత్తం ఇదే చర్చ! గతేడాది మణిపూర్‌లో జరిగిన అల్లర్లు ఎంతటి హింసకు దారితీశాయో.. ఎన్ని వందల మంది ప్రాణాలను తీసుకున్నాయో.. భారత్ మొత్తం చూసింది. అయితే.. ఆ అల్లర్ల వెనుక ఎవరున్నారు? హింసను ప్రేరేపించింది ఎవరనేదానిపై.. ఆ రాష్ట్ర సీఎం బీరెన్ సింగ్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు ఆయన పేరుతో ఓ ఆడియో క్లిప్ వైరల్ అవడమే ప్రధాన కారణం. మెయితీలు, కుకీల మధ్య జరిగిన హింసను.. సీఎం బీరెన్ సింగే ప్రేరేపించారని లీకైన ఆడియో క్లిప్ హాట్ టాపిక్‌గా మారింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయుధాలను లూటీ చేసేందుకు.. మెయితీలకు అవకాశమివ్వండి అంటూ ఆదేశించే ఆడియో క్లిప్ వైరల్ అయింది. దాంతో వివాదం మరింత ముదిరింది.సీఎం బీరెన్ సింగ్ వ్యాఖ్యలతో సంబంధం ఉన్న ఆడియో టేపులు లీక్ అయ్యాయని ఆరోపిస్తూ.. కుకీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దాంతో.. ఈ ఇష్యూని సీరియస్‌గా తీసుకొని సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. లీక్ అయిన ఆడియో క్లిప్‌లను.. హైదరాబాద్‌లోని స్వతంత్ర ఫోరెన్సిక్ ల్యాబ్.. ట్రూత్ ల్యాబ్స్ పరిశీలించింది. అందులోని వాయిస్.. సీఎం బీరెన్ సింగ్ గొంతుతో 93 శాతం మ్యాచ్ అయిందని.. కుకీ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టుకు రిపోర్ట్ ఇచ్చారు. అదే.. ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది.అయితే.. కేంద్రం తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. ఈ రిపోర్ట్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారు. వైరల్ అయిన ఆడియో క్లిప్‌పై.. కేంద్ర ఫోరెన్సిక్ ల్యాబ్ పరిశీలనకు 3 వారాల గడువు కావాలని కోరారు. ఇలాంటి పిటిషన్ దాఖలు చేయడం వెనుక కుకీ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ఉద్దేశాన్ని సైతం ప్రశ్నించారు. వారికి సైద్ధాంతిక ధోరణులు, వేర్పాటువాదుల రకాలు ఉన్నాయని మెహతా వాదించారు. పిటిషనర్ ఉద్దేశం కేవలం ఇప్పుడున్న సున్నితమైన అంశాన్ని మరింత మరిగించడమేనన్నారు. పైగా.. ఈ కేసుని మణిపూర్ హైకోర్టు విచారించాలని ఆయన కోరుతున్నారు. అయితే.. ఈ కేసుని.. తాము విచారించాలా? మణిపూర్ హైకోర్టు విచారించాలా? అనేది తదుపరి విచారణలో నిర్ణయిస్తామని సుప్రీం ధర్మాసనం తెలిపింది.పూర్తి వాదనలు విన్న తర్వాత సీఎం బీరెన్ సింగ్ ఆడియోకు సంబంధించి ఫోరెన్సిక్ రిపోర్ట్ అందించాలని.. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం.. ప్రభుత్వ ఫోరెన్సిక్ లాబొరేటరీ %జఖీూా%కు ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై తదుపరి విచారణను మార్చి 24కు వాయిదా వేసింది. వాస్తవానికి.. ఏడాదిన్నర కాలంగా మణిపూర్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి.మెయితీలు, కుకీల మధ్య రేగిన ఘర్షణల్లో ఇప్పటివరకు 250 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇప్పటికీ.. ఆ రాష్ట్రం అట్టుడుకుతూనే ఉంది. హింసని నిలువరించేందుకు ప్రభుత్వం అన్నిరకాలుగా ప్రయత్నిస్తోంది. ఓ వైపు సర్కార్ చర్యలు కొనసాగుతున్నా.. హింసను పూర్తిగా అణచివేయడంలో పూరి స్థాయిలో విఫలమవుతున్నారనే అభిప్రాయాలున్నాయి. ఇదే సమయంలో.. హింసను ప్రేరేపించేలా ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌పై ఆదేశాలిచ్చారంటూ వచ్చిన ఆరోపణలు.. ఈ సమస్యని మరింత క్లిష్టంగా మార్చాయి.రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉంటూ.. హింసాగ్నిని చల్లార్చేందుకు, శాంతిభద్రతల్ని కాపాడేందుకు ప్రయత్నించాల్సిన సమయంలో.. ఓ వర్గానికి కొమ్ము కాస్తూ.. వారి పట్ల సానుకూలతను వ్యక్తం చేయడం, హింసను ప్రేరేపించేలా ఆదేశాలిచ్చారనే ఆరోపణలు.. ఇప్పుడు దేశ రాజకీయ వర్గాల్లో దుమారం రేపుతున్నాయి. మణిపూర్‌లో రెండు వర్గాల మధ్య నెలకొన్న వైషమ్యాలు, హింస ఏ స్థాయికి చేరాయో అంతా చూశాం. ఇలాంటి సమయంలో.. సీఎం బీరెన్ సింగ్ చర్యలు మరింత హింసను పెంచేలా చేశాయనే వాదనలు వినిపిస్తున్నాయి. పైకి అంతా ప్రశాంతంగానే కనిపిస్తున్నా.. మణిపూర్ ఇంకా మండుతూనే ఉంది. అక్కడి వాతావరణమంతా.. నివురుగప్పిన నిప్పులానే ఉంది. ఘర్షణలు తగ్గినప్పటికీ.. మెయితీ, కుకీ, నాగ తెగల ప్రజలు కలిసి జీవించాలనే కల.. కొన్ని నెలల కిందటే చెదిరిపోయింది. పరస్పర విశ్వాసం కోల్పోయిన అక్కడి ప్రజలు నిస్సహాయంగా మారారు. హింసాత్మక అల్లర్లు ఆగిపోయి ఏడాదిన్నర దాటినా.. మణిపూర్‌లో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. ఇంకా.. మెయితీలు, కుకీ తెగలు రగిలిపోతూనే ఉన్నాయి. ఇంతలోనే.. సీఎం బీరెన్ సింగ్ పేరుతో ఆడియో క్లిప్ వైరల్ అవడం.. అందులో మెయితీలకు సానుకూలంగా మాట్లాడారనే ఆరోపణలతో.. హీట్ మరింత పెరిగింది. ఈ పరిస్థితుల నుంచి మణిపూర్ ఎప్పటికి బయటపడుతుందన్నదే ఇప్పుడు అంతుచిక్కని ప్రశ్నగా మారింది.మెయితీలు, కుకీ తెగల మధ్య భూమి, పలుకుబడి విషయంలో మొదలైన వివాదం.. రెండు జాతుల మధ్య హింసకు దారితీసింది. అది కాస్తా.. రాష్ట్రాన్ని అగ్నిగుండంలా మార్చేసింది. ఈ భయానక పరిస్థితుల్ని భారత్ మొత్తం చూసింది. ఇప్పటికీ.. మణిపూర్‌లో ఆ రెండు తెగల మధ్య అంతర్యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఏడాదిన్నర కిందట అక్కడ అల్లర్లు చెలరేగినప్పుడు.. ఇండియన్ ఆర్మీ, పారామిలిటరీ బలగాలు, పోలీసులు.. హింసను ఆపేందుకు ఎంత ప్రయత్నించినా.. ఆ మంటలు చల్లారలేదు. ఆ సమయంలోనే పోలీసుల ఆయుధాల్ని దొంగిలించారు. అలా.. రెండు తెగల మధ్య ఘర్షణ.. మరింత హింసాత్మకంగా మారింది.మణిపూర్‌లో సంక్షోభం తలెత్తేందుకు అనేక కారణాలు ఉన్నాయి. సుమారు 35 గిరిజన తెగలున్నా.. ప్రధాన తెగలు మూడే. అవే.. మెయితీ, కుకీ, నాగ తెగలు. మణిపూర్ మొత్తం జనాభా 33 లక్షలు ఉంటే.. అందులో 53 శాతం మెయితీలే ఉన్నారు. వీరంతా.. రాష్ట్రం మధ్యలోని ఇంఫాల్ లోయలో నివసిస్తున్నారు. పైగా.. మణిపూర్‌లో ప్రభావవంతమైన వర్గంగా ఉన్నారు. ఈ కుకీ, నాగాతో పాటు ఇతర తెగలన్నీ కలిపి.. 47 శాతంగా ఉన్నారు. వీరంతా.. ఇంఫాలో లోయ చుట్టూ ఉన్న కొండ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ప్రస్తుతం.. ఎస్సీ, ఓబీసీ హోదాతో ఉన్న మెయితీలు, నాగా, కుకీల మాదిరిగానే.. తమకు కూడా ఎస్టీ హోదా కావాలని కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇదే.. వివాదానికి దారితీసింది. మణిపూర్‌ని అట్టుడికిపోయేలా చేసింది.మెయితీల డిమాండ్‌కు సంబంధించి.. రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలపాలని.. మణిపూర్ హైకోర్ట్ ఆదేశించింది. దీనిపై.. అప్పటికి ప్రభుత్వం స్పందించలేదు. ఒకవేళ.. మణిపూర్ సర్కార్ మెయితీలకు సానుకూలంగా స్పందిస్తే.. తమకు నష్టం జరుగుతుందని కుకీ, నాగ తెగలకు చెందిన వారు ఘర్షణ పడటంతో హింస మొదలైందనే వాదనలున్నాయి. ఇప్పటికే.. ప్రభుత్వంలో, సమాజంలో బాగా పలుకుబడి ఉన్న మెయితీల ప్రాబల్యాన్ని మరింత బలోపేతం చేస్తే.. కుకీలు ఎక్కువగా ఉండే కొండ ప్రాంతాల్లో భూములు కొనేందుకు, అక్కడే స్థిరపడేందుకు వారికి అనుమతించినట్ల వుతుందని.. కుకీలు వ్యతిరేకిస్తున్నారు.అదీగాక.. 53 శాతం ఉన్న మెయితీల చేతుల్లో 10 శాతం భూమి ఉంటే.. 47 శాతం ఉన్న నాగ, కుకీ, ఇతర తెగల చేతుల్లో 90 శాతం భూమి ఉంది. ఇంఫాల్ లోయలో పెరుగుతున్న జనాభా, తరుగుతున్న వనరులు, నిరుద్యోగం, వలసలు, ఇతర కారణాలతో మెయితీలు కూడా కొండ ప్రాంతాలకు విస్తరించాలనుకుంటున్నారు. కానీ.. ఇప్పుడున్న చట్టాల ప్రకారం ఎస్టీలు మాత్రమే కొండ ప్రాంతాల్లో భూముల్ని కొనుగోలు చేయాలి. అందువల్ల.. తమకు కూడా షెడ్యూల్డ్ తెగ హోదా కల్పించాలనేది మెయితీల డిమాండ్. దీనిని.. కుకీ, నాగ తెగలు వ్యతిరేకిస్తున్నా యి.కుకీ తెగ ఆందోళనకు ఇతర కారణాలూ ఉన్నాయి. మణిపూర్ ప్రభుత్వం డ్రగ్స్‌పై చేపట్టిన యుద్ధంతో.. తమ కమ్యూనిటీలను సమూలంగా నాశనం చేయాలని చూస్తోందని ఆరోపిస్తున్నారు. మయన్మార్ నుంచి పెరిగిన అక్రమ వలసలు కూడా ఉద్రిక్తతల్ని మరింత పెంచాయి. పెరుగుతున్న జనాభాతో.. రాష్ట్రంలో భూ వినియోగంపై ఒత్తిడి పెరిగింది. ఇలా.. అనేక కారణాలున్నాయి. అయితే.. అల్లర్లు చెలరేగిన తర్వాత.. అవి

# తెలంగాణకు మళ్లీ అన్యాయమే!

హైదరాబాద్,కేంద్ర బడ్జెట్ 2025-26 మళ్లీ ఒకసారి రాష్ట్రాల హక్కులను విస్మరించింది. మరీ ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన ప్రాధాన్యతను కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం లేదు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, కేంద్రం సముచితంగా స్పందించాలని కోరినా.. తెలంగాణపై కేంద్రం అంతులేని వివక్ష కనబరచింది. రాష్ట్రానికి నయాపైసా కేటాయించకపోవడం బీజేపీ నిర్లక్ష్యానికి నిదర్శనం. బీజేపీకి తెలంగాణ ఓట్లు కావాలి.. కానీ తెలంగాణ అభివృద్ధి మాత్రం వారికి పట్టదన్నదే తాజా బడ్జెట్ సారాంశం.పేదలు, యువత, రైతులు, మహిళల పురోభివృద్ధే లక్ష్యంగా కేంద్రం 2025-26 బడ్జెట్‌ను పార్లమెంట్ ముందు ఉంచింది. వికసిత్ భారత్ దిశగా.. సంస్కరణలు కొనసాగిస్తామని చెబుతూనే బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేసింది. పది రంగాలకు ఊతమిచ్చి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ప్రకటించింది. దేశంలో ప్రాంతీయ అనుసంధానతను పెంచేందుకు కొత్త పద్దులో మరింత ప్రాధాన్యం ఇచ్చింది. ఎంఎస్ఎంఈల ద్వారా ఎగుమతులను రెట్టింపు చేస్తామని వెల్లడించింది. వేతన జీవులకు 12 లక్షల వరకూ ఆదాయ పన్ను మినహాయింపులు కల్పించింది. మొత్తంగా 50 లక్షలకు పైగా కోట్లతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను కేంద్రం ప్రతిపాదించింది.

### రాష్ట్రాల ఆర్థిక స్వతంత్రతను పరిగణించకుండా..

'ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించిన అభివృద్ధి చర్యలు పది విస్తృత రంగాల్లో ఉన్నాయి. పేదలు, యువత, అన్నదాత, మహిళలపై దృష్టిపెట్టడంతో పాటు వ్యవసాయ అభివృద్ధి, దిగుబడి పెంపు, గ్రామాల్లో నిర్మాణాత్మక అభివృద్ధి, సమగ్రాభివృద్ధి పథంలోకి అందరినీ కలుపుకుని వెళ్లడం, మేకిన్ ఇండియాలో భాగంగా ఉత్పత్తి పెంపు, ఎమ్ఎస్ఎమ్ఈలకు మద్దతు, ఉద్యోగాలు కల్పించే అభివృద్ధి, ప్రజా ఆర్థిక వ్యవస్థ, ఆవిష్కరణల రంగంలో పెట్టు బడులు, ఇంధన సరఫరా పరిరక్షణ, ఎగుమతులకు ప్రోత్సాహం, ఆవిష్కరణలు పెంచి పోషించడం ఇందులో భాగం. ఈ అభివృద్ధి యాత్రలో వ్యవసాయం, ఎమ్ఎస్ఎమ్ఈలు, పెట్టుబడులు, ఎగుమతులు మన శక్తివంతమైన ఇంజన్లు'. ప్రతీసారి బడ్జెట్ ప్రభుత్వ కోశాగారాన్ని నింపడంపై దృష్టి సారిస్తే.. ఈ సారి పద్దు మాత్రం ప్రజల జేబులను నింపడానికి, తద్వారా వారి పొదుపును పెంచడానికి ఉద్దేశించిందని మోడీ వివరించారు. ఆత్మ నిర్భర్ భారత్‌ను ఈ పన్ను మరింత బలోపేతం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక ఈ బడ్జెట్ కొన్ని వస్తువుల కస్టమ్స్ సుంకాలను తగ్గించినప్పటికీ, సెస్‌లను పెంచడం ద్వారా రాష్ట్రాలకు వెళ్లాల్సిన ఆదాయపు వాటాను మరింత తగ్గించింది. ఈ విధానం కేంద్రం -



రాష్ట్రాల ఆర్థిక సంబంధాల్లో రాష్ట్రాల న్యాయమైన వాటాను దెబ్బ తీసేలా ఉంది. రాష్ట్రాల ఆర్థిక స్వతంత్రతను పెంచాలనే రాష్ట్రాల డిమాండ్‌ను పరిగణించకుండా, సీఎస్ఎస్‌పై ఆధారపడే విధానాన్ని మరింత పెంచడం ఆర్థిక సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం.

### సమర్థవంతమైన వనరులు ఉన్నప్పటికీ..

ఈ బడ్జెట్‌లో బిహార్ రాష్ట్రానికి వివిధ పథకాల ద్వారా అధిక నిధులు కేటాయించబడినప్పటికీ, గతంలో ఆ రాష్ట్రం ఆదాయంలో ప్రాశస్త్యాన్ని చూపింది. ఆర్థిక లోటు అనుమతించిన పరిమితికి తక్కువగా ఉంది. అయితే, సమర్థవంతమైన వనరుల వినియోగ సామర్థ్యం ఉన్న తెలంగాణ వంటి రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడం కేవలం తెలంగాణకే కాకుండా, దేశ అభివృద్ధికి కూడా నష్టం కలిగించే అంశం. తెలంగాణ రాష్ట్రం సాగు ప్రాజెక్టులను ప్రాధాన్యతగా భావిస్తూ నిరంతరం పనిచేస్తుంది. కానీ, ఈ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర సాగు ప్రాజెక్టులకు గణనీయమైన నిధులు కేటాయించలేదు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడంలో ఈ బడ్జెట్ వైఫల్యం చెందింది. కేంద్రం వ్యవసాయ అభివృద్ధి గురించి గొప్పగా మాట్లాడుతున్నా, తెలంగాణలోని సాగు ప్రాజెక్టులను పక్కన పెట్టడం దారుణం. అలాగే కొత్త గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాల అభివృద్ధి విషయంలో బిహార్‌కి నిధులు కేటాయించింది కానీ వరంగల్ విమానాశ్రయాన్ని పట్టించుకోలేదు. అలాగే తెలంగాణ, దేశంలో కృత్రిమ మేధస్సు రంగంలో అగ్రగామిగా నిలుస్తోంది. ఎన్‌విడియా, ఇంటెల్, అడోబ్ వంటి గ్లోబల్ సంస్థల భాగస్వామ్యంతో "తెలంగాణ ఎఐ మిషన్" (టి- ఎ ఐ ఎం) విజయవంతంగా అమలవుతోంది. కానీ గతంలో కేంద్రం ప్రకటించిన మూడు ఏఐ కేంద్రాల స్థాపనలో తెలంగాణను పూర్తిగా విస్మరించింది.

# పోలీసు అధికారులపైన కేసు ఫైల్

హైదరాబాద్, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉన్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కుమారుడు డా.చైతన్యరెడ్డిపై కేసు నమోదు అయ్యింది. అలాగే పలువురు పోలీసు అధికారులపైనా కేసు ఫైల్ అయ్యింది. వివేకా కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కడప సెంట్రల్ జైల్లో ఉన్నప్పుడు జైల్లో చైతన్య తమను కలిసి మభ్యపెట్టినట్లు గతంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు దస్తగిరి. వివేకా కేసులో కేవలం బాధితుల ఒత్తిడి వల్ల అప్రూవర్‌గా మారి అపద్దాలు చెప్పాల్సి వచ్చిందని.. చెప్పమని చైతన్య ఒత్తిడి తెచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలా చేస్తే రూ.20 కోట్లు ఇస్తామని చైతన్య మభ్యపెట్టినట్లు అప్పట్లో దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా చైతన్య రెడ్డితో పాటు అప్పట్లో కేసు నమోదు చేయకుండా నిందితులకు సపోర్టు చేయమని తనపై ఒత్తిడి తెచ్చిన పోలీసు అధికారులపైనా దస్తగిరి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు డీఎస్పీ నాగరాజు, సీఐ ఈశ్వరయ్య, సెంట్రల్ జైలు సూపరెండెంట్ ప్రకాష్‌లపై పులివెందుల పోలీసులు ఇప్పుడు కేసు నమోదు చేశారు. కాగా.. 2023 నవంబర్‌లో దస్తగిరి రిమాండ్ ఖైదీగా జైలులో ఉన్న సమయంలో చైతన్య రెడ్డి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి తనను బెదిరించాడంటూ పలు మార్లు మీడియాకు తెలిపారు దస్తగిరి. అంతేకాకుండా సీబీఐ, జిల్లా ఎస్పీలకు కూడా ఫిర్యాదు చేశారు. మొత్తానికి దస్తగిరి ఇచ్చిన ఫిర్యాదుపై ఎట్టకేలకు చైతన్య రెడ్డిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. చైతన్య రెడ్డితో పలువురు పోలీసులు అధికారులపై కూడా కేసులు నమోదు అయ్యాయి.అయితే గతంలో దస్తగిరి ఫిర్యాదును తప్పుబట్టారు చైతన్య. కేవలం మెడికల్ క్యాంపు కోసమే జైలు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. తనతో పాటు జైలు అధికారులు, వైద్యాధికారులు ఉన్నట్లు తెలిపారు. తాను నిజంగా జైలుకు బెదిరించడానికే వెళ్లి ఉంటే అప్పుడే ఎందుకు ఫిర్యాదు చేయాలేదని అప్పట్లోనే చైతన్య రెడ్డి ప్రశ్నించారు. దస్తగిరిది అంతా క్రిమినల్ మైండ్ అంటూ వ్యాఖ్యలు చేశారు. మరి ఇప్పుడు తాజాగా పోలీసులు కేసు నమోదు చేయడం పట్ల చైతన్య రెడ్డి ఏ మేరకు స్పందిస్తారో చూడాలి. మరోవైపు దస్తగిరిని బెదిరించారంటూ ఆరోపణలు ఎదుర్కుంటున్న చైతన్య రెడ్డికి గతంలో సుప్రీం కోర్టు నోటీసులు కూడా జారీ చేసింది.

# మళ్లీ స్పీడ్‌పెంచిన హైడ్రా

హైదరాబాద్, కొద్ది రోజులుగా దూకుడు తగ్గించిన హైడ్రా మళ్లీ రంగంలోకి దిగింది. బుధవారం శంషాబాద్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు పక్కన ప్రహరీ గోడలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. సర్వే నంబర్లు 601, 602 లో చేపట్టిన ప్రహరీ గోడను తెల్లవారుజామున కూల్చివేశారు. వివాదాస్పద రోడ్డు స్థలం విషయంలో ఫిర్యాదులు రావడంతో కూల్చివేశారు. అయితే తమ పట్టా భూమిలో తాము నిర్మించుకున్న ప్రహరీ గోడను హైడ్రా అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కూల్చివేసారని బాధితులు మండిపడుతున్నారు. హైడ్రా అధికారుల తీరుపై న్యాయపోరాటం చేస్తామని బాధితులు ప్రకటించారు. కాగా నిర్మాణరంగ, ఇతర వ్యర్థాల అక్రమ డంపింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని హైడ్రా నిర్ణయించింది. చెరువులు, నాలాలు, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పోసే వాహనాలపై సంస్థ బృందాలు ప్రత్యేక నిఘా పెట్టాయి. పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి అక్రమంగా వ్యర్థాలు డంప్ చేస్తోన్న నాలుగు టిప్పర్లను హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు పట్టుకున్నాయి. ఉందాసాగర్‌లో వ్యర్థాలు పోస్తున్న నాలుగు టిప్పర్లు, పోసిన మట్టిని వెంటనే చదును చేస్తోన్న ప్రొక్లెయినర్‌నూ పట్టుకున్నారు. అనంతరం బండ్లగూడ పోలీస్ స్టేషన్‌లో వాహనాలు, డ్రైవర్ క్లీనర్‌ను అప్పగించి వారిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవులపల్లి (సమర్‌కుంట) చెరువులో మట్టి పోస్తోన్న మరో లారీని పట్టుకున్నారు. వాహనం, డ్రైవర్, క్లీనర్‌ను పోలీసులకు అప్పగించారు. వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో మట్టి, ఇతర వ్యర్థాలు పోస్తే కేసులు నమోదు చేస్తామని, అన్ని ప్రాంతాల్లో హైడ్రా బృందాల నిఘా ఉందని కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు.

# అక్రమిత కాశ్మీర్‌కు హమాస్

న్యూఢిల్లీ, ఇజ్రాయెల్ దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్న పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్ ఇప్పుడు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో అడుగుపెట్టబోతోందని ప్రచారం జరుగుతోంది. దీంతో భారత నిఘా వర్గాలు ఒక్కసారిగా అప్రమత్తం అయ్యాయి. కశ్మీర్ సంఘీభావ దినం సందర్భంగా బుధవారం పీవోకేలో 'అల్ అక్సా ఫ్లడ్స్' పేరిట ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో హమాస్‌కు చెందిన సీనియర్ నేత ప్రసంగించనున్నట్లు తెలుస్తోంది. ఈ సభను రావల్కోట్‌లోని సబీర్ స్టేడియంలో ఏర్పాటుచేశారు. దీనిలో ఉగ్రసంస్థలైన లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, సీనియర్ నాయకులు కూడా పాల్గొనున్నారు. ఈ కార్యక్రమంలో హమాస్ ప్రతినిధి ఖలీద్ కద్దామి ప్రసంగించనున్నట్లు కరపత్రాలు, ఇతర మార్గాల్లో ప్రచారం చేస్తున్నారు. అతడు కశ్మీర్‌లో పోరాటాన్ని పాలస్తీనాతో ముడిపెట్టి మాట్లాడొచ్చని ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. జిహాదీ సంస్థలు తమ వాదనలకు బలం చేకూర్చేలా వాదనలు సృష్టించేందుకు దీనిని వాడుకోవచ్చు. మసూద్ అజర్ సోదరుడు తల్హాసైఫ్, అస్గర్‌ఖాన్, ఇలియాస్ మసూద్ వంటి ఉగ్రవాదులు సభకు హాజరుకావచ్చని చెబుతున్నారు. ఈ సమయంలో భారత హోం మంత్రి అమిత్ షా మంగళవారం జమ్మూకశ్మీర్‌పై హైలెవల్ మీటింగ్‌ను నిర్వహించారు. అక్కడి భద్రతా పరిస్థితులను, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్ల పరిస్థితిని ఆయన పర్యవేక్షించారు. ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, సీమాంతర చొరబాట్లను అడ్డుకోవడం వంటి అంశాలపై దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. కశ్మీర్‌లో వాహన తనిఖీలను కూడా తీవ్రతరం చేయాలని ఆదేశించారు. గతేడాది ఆగస్టులో హమాస్ నేతలతో లష్కరే ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ భేటీ అయ్యాడు. ఖతార్ రాజధాని దోహా దీనికి వేదికైంది. 2018లో సైఫుల్లాను అమెరికా ఉగ్రజాబితాలో చేర్చింది. లష్కరే వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌కు అతడు సన్నిహితుడు.

# బంగారం ధరలు పరుగు

న్యూఢిల్లీ, బంగారం ధరలు ఆల్ టైం రికార్డు ధరకు చేరుకున్నాయి. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై బుధవారం 1040 రూపాయలు పెరిగింది. దీంతో.. రికార్డ్ స్థాయిలో బంగారం ధర 86,240 రూపాయలకు చేరుకుంది. 22 క్యారెట్ల బంగారం ధర కూడా950 రూపాయలు పెరిగి 78,100 నుంచి 79,050 రూపాయలకు ఎగబాకింది. బంగారం ధరలు పెరుగుతున్న తీరు చూస్తుంటే ఫిబ్రవరి నెలాఖరు నాటికే తులం బంగారం ధర 90 వేల మార్క్?ను దాటిపోవచ్చని బులియన్ మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. గత పదిరోజుల్లో బంగారం ధర జనవరి 27, జనవరి 28, ఫిబ్రవరి 3న మాత్రమే తగ్గింది. మిగిలిన ఏడు రోజుల్లో ఫిబ్రవరి 2న బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి. వరుసగా కాకపోయినా బంగారం ధరలు ఆరు రోజులు అమాంతం పెరిగి ప్రస్తుతం పసిడిని అత్యంత ప్రియమైందిగా మార్చేశాయి.జనవరి 27న హైదరాబాద్ మార్కెట్?లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర 82,250 రూపాయలు. ఫిబ్రవరి 5న 86,240 రూపాయలు.

# పేదల సంక్షేమంపై కేంద్రం నిర్లక్ష్యం



న్యూఢిల్లీ,కేంద్ర ప్రభుత్వం ఇదివరకు ఎన్నడూ లేని రెట్టింపు ఉత్సాహంతో విడుదల చేసిన బడ్జెట్‌లో మొత్తం మధ్యతరగతికి పన్నురహిత ప్రయోజనం కలిగించి ప్రశంసలు గొంది. అయితే బ్యూరోక్రాటిక్ డాక్యుమెంట్లు బయటపెట్టిన ఆర్థిక చిత్రాన్ని పరిశీలిస్తే దిగువ తరగతుల సంక్షేమానికి అవసరమైన కీలకమైన అంశాలపై ప్రభుత్వం నిర్లక్షం వహించిందని తెలుస్తోంది. మొత్తం ఆర్థిక వ్యవస్థ విధానాల్లోని సూచికల్లో ఒకటి ఆహార ద్రవ్యోల్బణం. విధాన నిర్ణేతలు దీనిపైనే తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దేశంలోని ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిశీలిస్తే 2024 జులైలో 5.4 శాతం, ఆగస్టులో 5.6 శాతం వరకు ద్రవ్యోల్బణం కనిపించింది. అదే ఏడాది సెప్టెంబర్ నాటికి అమాంతంగా 9.2 శాతానికి పెరిగిపోవడం ఆందోళన కలిగించింది. ఈ అత్యదిక ఆహార ద్రవ్యోల్బణం కొనుగోలుశక్తి అంతగాలేని బలహీన వర్గాలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది.పప్పు ధాన్యాలు, సంబంధిత ఉత్పత్తుల ధరలు 2022 ఆగస్టు నుంచి రెండేళ్లుగా 7 నుంచి 17 శాతం స్థాయిలో స్థిరంగా ఉన్నప్పటికీ, 2023 జూన్‌లో 10 నుంచి 21 శాతం స్థాయిలో పెరగడం ప్రారంభించాయి. అదే విధంగా 2023 జులై నుంచి కూరగాయల ధరలు 20 శాతం కన్నా ఎక్కువగానే అమాంతంగా పెరుగుతున్నాయి. 2024 సెప్టెంబరు నుంచి ఖాద్యతైలాలు (వంట నూనెలు) కొవ్వుపదార్థాల ధరలు 2.5 శాతం వరకు పెరిగాయి. ఈ అస్తవ్యస్త పరిస్థితుల్లోనూ పేదలు తమకు వచ్చే ఆదాయంలో 70 శాతం ఆహారానికి ఖర్చు పెడుతున్నారు. అర్బన్ ఏరియాల్లో ఉండేవారు ఆహారం కోసం తమ ఆదాయంలో సరాసరిన 40% ఖర్చుపెడుతున్నారు. అదే గ్రామీణ ప్రాంతాల్లోని వ్యక్తి తన ఆదాయంలో 48% ఆహారం కోసం వెచ్చిస్తున్నాడు. ఇక దిగుమతి అవుతున్న ద్రవ్యోల్బణం ముఖ్యంగా ముడిచమురు, పప్పుదినుసులు, ఖాద్యతైలాలు వంటివి బలహీనమైన రూపాయి మారకం కారణంగా ఆహార ద్రవ్యోల్బణానికి మరింత ఆజ్యం పోస్తున్నాయి.ఈ మేరకు ధరల స్థిరీకరణ కావాలంటే మార్కెట్‌లోకి ప్రభుత్వం జోక్యం చేసుకోవడం అవసరం. ఇదిలా ఉండగా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆహార సబ్సిడీకి నిధుల కేటాయింపు తగ్గించారు. 202425 బడ్జెట్‌లో రూ. 2,05,250 కోట్లు కేటాయించగా, ఈసారి 202526 బడ్జెట్‌లో రూ. 2,03,420 కోట్లు కేటాయించారు. అంటే ఆహార సబ్సిడీకి నిధుల కేటాయింపు 0.89 శాతం తగ్గింది. అదే విధంగా గ్రామీణాభివృద్ధికి కేటాయింపు కేవలం 0.38 శాతం లేదా రూ. 1009 కోట్లు మాత్రమే పెంచింది. 2024 25 లో రూ. 2,65,808 కోట్లు కేటాయించగా, 2025 26లో రూ. 2,66, 817 కోట్లు కేటాయించింది. ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేయడానికి ఈ కీలకమైన రంగానికి కేటాయింపులు కుదించుకుపోయాయి. యువతకు ఉజ్వల భవితవ్యాన్ని చేకూర్చే అత్యంత ముఖ్యమైన రంగాల్లో విద్యకు కూడా కేటాయింపులు కంటితుడుపుగా ఉన్నాయి.కేవలం 2.4 శాతం మాత్రమే నిధులు పెంచారు. గత ఏడాది బడ్జెట్‌లో రూ. 1,25,638 కోట్లు కేటాయించగా, ఈసారి 2025 26 బడ్జెట్‌లో రూ. 1,28,650 కోట్లు కేటాయించారు. అంటే అదనంగా కేవలం రూ. 3012 కోట్లు మాత్రమే పెంచడమైంది. ఈ చాలీచాలని నిధులతో ద్రవ్యోల్బణం ఏమాత్రం సర్దుబాటు కాదు సరికదా, ప్రతికూల పరిణామాలకు దారితీస్తాయి. ప్రభుత్వం నిర్వహించే విద్యాసంస్థలు నిధుల కొరతతో అల్లాడే పరిస్థితి ఏర్పడుతుంది. ఫలితంగా చైనా సవాలును ఎదుర్కోవడం అసాధ్యం అవుతుంది. సామాజిక సంక్షేమానికి కేటాయింపులు 6.28 శాతం వరకు భారీగా (రూ. 56,501 కోట్లు నుంచి రూ. 60,052 కోట్లు) పెరిగాయి. ఆరోగ్యానికి 10.11 శాతం పెంచారు. రూ. 89,287 కోట్లు నుంచి రూ.98,311 కోట్లు వరకు పెంచారు. ఇది కాస్త ద్రవ్యోల్బణ ప్రభావాన్ని నియంత్రించ గలుగుతుంది.ఈశాన్య ప్రాంతాలకు నాయకత్వం వహిస్తున్నామని బిజెపి చెప్పుకొంటున్నప్పటికీ నిధుల కేటాయింపులో మాత్రం నిర్లక్షం వహించడమైంది. ఈ ప్రాంతాల అభివృద్ధికి 202425 లో రూ. 5900 కోట్లు కేటాయించగా, 202526 లో రూ. 5915 కోట్లు మాత్రమే కేటాయించారు. రేఖామాత్రంగా 0.25 శాతం పెంపు కనిపించింది. వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య కార్యక్రమాలుగా ప్రగల్భాలు ప్రచారం చేస్తున్నప్పటికీ, ఆర్థిక మంత్రి సీతారామన్ వ్యవసాయ రంగంలో రైతులకు ప్రయోజనం కలిగించడానికి అనేక పథకాలు వెల్లడించినప్పటికీ, నిధుల కేటాయింపులో పెంపుదల 12.9 శాతం వరకే కనిపిస్తుండటం గమనించదగినది.ఇవన్నీ ఇలా ఉండగా, సైంటిఫిక్ విభాగాలకు ఈసారి భారీగానే 70.08 శాతం వరకు నిధుల కేటాయింపు జరగడం విశేషం. గత ఏడాది బడ్జెట్‌లో రూ. 32,736 కోట్ల వరకు కేటాయింపులు జరగ్గా, ఈ ఏడాది బడ్జెట్‌లో అమాంతంగా రూ. 55,679 కోట్లు కేటాయించారు. సైన్సు పరిశోధనలకు ప్రభుత్వం ప్రోత్సాహం భారీగా అందించాలన్న లక్షం పెట్టుకోవడం ఎంతైనా ముదావహం. ముఖ్యంగా ప్రపంచంలో అత్యంత ఆధునిక సాంకేతికత ఆవిష్కరణలు విస్తరిస్తున్న సమయంలో దానికి తగ్గట్టు మన దేశంలో కూడా వినూత్న పరిశోధనలు జరగడానికి అవకాశం ఏర్పడుతుంది. అదే విధంగా నగరాభివృద్ధి (అర్బన్ డెవలప్‌మెంట్) కి భారీగా నిధులు కేటాయింపు జరిగింది. గత ఏడాది రూ. 82,577 కోట్లు కేటాయించగా, ఈసారి రూ. 96,777 కోట్లు కేటాయించారు. ఇదే క్రమంలో ఇంధన రంగానికి నిధుల కేటాయింపులో 18 శాతం పెరుగుదల కనిపిస్తోంది.

## ఏపీ ప్రబలుతున్న వింత వ్యాధి

అమరావతి, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని కోళ్లలో ప్రస్తుతం ఒక వింత వ్యాధి వ్యాపిస్తోంది. దాదాపు 4 లక్షల కోళ్లు ప్రభావితమయ్యాయి. సమాచారం అందుకున్న పశువైద్య శాఖ అధికారులు కోళ్ల ఫారాలలో తనిఖీలు నిర్వహించారు. కోళ్ల నుండి రక్త నమూనాలను సేకరించి విజయవాడ, భోపాల్‌లోని పరీక్షా కేంద్రాలకు పంపారు. గత మూడు వారాల్లో, ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి ప్రాంతంలో తెలియని వైరస్ కారణంగా లక్షకు పైగా కోళ్లు చనిపోయాయి. మరణానికి ఖచ్చితమైన కారణం ఇంకా తెలియలేదు. అధికారులు ఇది వైరస్ అయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. టీకాలు లేకపోవడం, సరైన నిర్వహణ లేకపోవడం వల్లే ఈ మరణాలు సంభవించి ఉండవచ్చని నివేదికలు సూచిస్తున్నాయి. గుడ్లు పెట్టిన నిమిషాల్లోనే కొన్ని కోళ్లు చనిపోయాయని రైతులు తెలిపారు. ఈ వైరస్ ఇతర కోళ్లలో వేగంగా వ్యాపించి, కోళ్ల పెంపకందారులకు పెద్ద నష్టాన్ని కలిగించింది. ఈ విషయంపై ఏలూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ టి. గోవింద రాజు మాట్లాడుతూ, గత మూడు వారాలలో ఒకే ప్రాంతంలో 35,000 కోళ్లు చనిపోయాయన్నారు. చనిపోయిన కోళ్లను సురక్షితంగా పూడ్చిపెట్టడానికి పశువైద్య అధికారులను వెంటనే పంపించినట్లు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లోని నివాసితులు కోళ్ల మాంసం తినకూడదని సూచించారు.

## పెద్దలు దీవించినట్లేనా ?

అమరావతి,తెలుగుదేశం అధినేత చంద్రబాబు రాజకీయ జీవితంలో పెద్దగా కష్టాలు అయితే లేవు. ఆయన 1978లో యువకుడిగా ఉన్నపుడే కాంగ్రెస్ ఐ అన్న కొత్త పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తరువాత అంతటి కాంగ్రెస్ మహా సాగరంలో మంత్రి కూడా అయ్యారు.ఇక కాంగ్రెస్ ఉమ్మడి ఏపీలో ఓడినా చంద్రబాబు రాజకీయం మాత్రం గెలుస్తూ వచ్చింది. అందుకే సొంత మామ ఎన్టీఆర్ పెట్టిన టీడీపీలో చేరి అక్కడ తన స్థానం సుస్థిరం చేసుకున్నారు. 1995లో సీఎం అయిపోయారు. నాటి నుంచి టీడీపీ బాబు పగ్గాలలోనే ఉంది.ఆయన తనయుడు నారా లోకేష్ 2009 ఎన్నికలలో పరోక్ష పాత్రతో రాజకీయాల్లోకి తన పరిచయాన్ని చేసుకున్నారు ఆయన 2014లో పార్టీ విజయం వెనక కూడా తెర వెనక పాత్ర పోషించారు అంటారు. అలా 2017 నాటికి మంత్రి అయిపోయారు 2024 లో మరోసారి మంత్రిగా పార్టీలో అత్యంత కీలకంగా మారారు.ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఇపుడు లోకేష్ చాలా ప్రాధాన్యతతో కూడిన పాత్రను పోషిస్తున్నారు. ఆయన తాజాగా ఢిల్లీ పర్యటన చేపట్టారు. చాలా మంది కేంద్ర మంత్రులను కలిసారు అందులో రాజ్ నాథ్ సింగ్ వంటి వారు లోకేష్ తో బాగా కలివిడిగా మాట్లాడారు. అశ్విని వైష్ణవ్ కూడా అదే తీరున అభిమానం చూపించారు. ధర్మేంద్ర ప్రధాన్ అయితే లోకేష్ తో బాగా ముచ్చటించారు.ఇలా కేంద్రంలో కీలక మంత్రులు అంతా లోకేష్ ని బాగా రిసీవ్ చేసుకున్నారు. ఇంతకు ముందే లోకేష్ బీజేపీలోని నంబర్ టూగా ఉన్న అమిత్ షాని కలిశారు. విశాఖ వచ్చిన ప్రధాని మోడీ ముందే తన స్పీచ్ తో ఆకట్టుకున్నారు ఇవన్నీ చూసిన వారికి కేంద్రంలో బీజేపీ పెద్దల ఆశీస్సులు బాబు వారసుడికి దక్కినట్లేనా అని చర్చించుకుంటున్నారు. చంద్రబాబు ఢిల్లీకి వెళ్తే ఏ రకమైన రిసీవింగ్ లభిస్తుందో అదే లోకేష్ కి దక్కుతోంది.లోకేష్ వెంట టీడీపీకి చెందిన కేంద్ర మంత్రులతో పాటు పార్టీ ఎంపీలతో ఒక భారీ బృందమే కనిపిస్తోంది. ఇలా లోకేష్ కమలం పార్టీ పెద్దలను కలుస్తూ ఏపీకి ఏమి కావాలో వివరిస్తున్నారు. అదే సమయంలో ఆయన ఏపీలో తన పాత్ర ఏమిటి అన్నది చెప్పకనే చెబుతున్నారని అంటున్నారు. అంతే కాదు జాతీయ మీడియాతోనూ ఆయన ఇంటరాక్ట్ అవుతున్నారు.ఏపీ నుంచి చంద్రబాబు వస్తే కనబరచే ఆసక్తి ఇపుడు లోకేష్ విషయంలోనూ జాతీయ మీడియా కనబరుస్తోంది. ఇవన్నీ చూసిన వారు అంతా అనేది ఒక్కటే అంటున్నారు. ఏపీకి ఫ్యూచర్ లీడర్ లోకేష్ అన్నది జాతీయ రాజకీయాలలో ఉన్న వారికి కూడా అర్థం అయిందా అన్నది. లోకేష్ కూడా స్వామి కార్యం స్వకార్యం అన్నట్లుగా తన ఇమేజ్ ని పెంచుకోవడంతో పాటుగా పార్టీని ప్రభుత్వాన్ని ఎలివేట్ చేస్తున్నారు. అలాగే ఏపీకి కేంద్రం నుంచి రావాల్సినవి అడుగుతున్నారు.ఒక విధంగా బాబుకు భారం తగ్గిస్తున్నారు. అదే సమయంలో తానే భవిష్యత్తు అని అటు పార్టీకి ప్రభుత్వానికి కూడా సంకేతాలు ఇస్తున్నారు. ఈ తరహా వ్యూహంతో లోకేష్ ఇపుడు జాతీయ రాజకీయాల్లో హైలెట్ అవుతున్నారు. పెద్దాయన జేసీ దివాకర్ రెడ్డి లోకేష్ బాబు మరో మూడేళ్ళ తరువాత సీఎం అవుతారని అంటున్నారు కానీ చినబాబు జోరు చూస్తుంటే ఆయన అంతకంటే ముందే అయ్యేట్లుగా ఉన్నారని అంటున్నారు.ఇక బీజేపీ పెద్దలకు ఏపీ రాజకీయం కావాలి. అందువల్ల వారు లోకేష్ కి తమ నిండు ఆశీస్సులు అందించక తప్పదని అది అనివార్యమని కూడా అంటున్నారు. బహుశా తనతోనే టీడీపీ అన్న సందేశాన్ని కూడా ఈ పర్యటనలో లోకేష్ జాతీయ పెద్దలకు ఇచ్చి ఉంటారని అంటున్నారు. సో లోకేష్ బాబు ఢిల్లీ టూర్ అయితే ఆయన ఇమేజ్ ని కొత్తగా బిల్డప్ చేయడంలో సూపర్ హిట్ అయినట్లే అని అంటున్నారు.

## రూ. 176.5 కోట్ల విడుదలకు ఆమోదం

హైదరాబాద్,జాతీయ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ "రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక పెట్టుబడి పథకం "కింద తెలంగాణకు రూ. 176.5 కోట్ల విడుదలకు ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద నిర్దేశించిన మైలురాయిని సాధించినందుకు రాష్ట్రాలు ప్రోత్సాహక మొత్తాన్ని పొందేందుకు అర్హులు. తెలంగాణ రాష్ట్రానికి జాతీయ రోడ్డు రవాణా శాఖ అదనపు ప్రోత్సాహక సహాయం అందించింది. తెలంగాణ ఈ పథకం ద్వారా మైల్ స్టోన్ 1లో రూ. 51.5 కోట్లు , మైల్ స్టోన్ 2లో రూ. 125 కోట్లకు అర్హత పొందింది. అంతే కాకుండా.. మోటార్ వెహికల్ ట్యాక్స్ కన్సెషన్ పథకం కింద తెలంగాణ రూ. 50 కోట్లు అర్హత సాధించింది. మైల్ స్టోన్ -2 కింద రాష్ట్ర ప్రభుత్వం 15 సంవత్సరాలు పైబడిన రవాణా వాహనాలను తొలగించేందుకు స్క్రాపింగ్ ప్రణాళికను పంపించింది. ఈ స్క్రాపింగ్ పథకంతో మరో రూ. 75 కోట్లు అర్హత సాధించింది. రాష్ట్రంలోని మొత్తం జిల్లాలలో 21 జిల్లాలు ప్రాధాన్యతగా తీసుకుని పని చేయడం ద్వారా తెలంగాణ రూ. 31.5 కోట్లు అర్హత పొందింది.

ప్రాధాన్యత లేని జిల్లాలకు రూ. 20 కోట్లు పొందేందుకు అర్హత పొందింది. ఈ మైలురాయి కింద మొత్తం అర్హత కలిగిన ప్రోత్సాహకం రూ. 51.5 కోట్లు. ఈ ఆర్థిక సాయం రాష్ట్రంలో రవాణా రంగం అభివృద్ధికి ఉపయోగపడనుంది. ఇంతలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రానికి అనుసంధానించే లింక్ రోడ్డు, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానితో అనుసంధానించే రోడ్లు, ప్రస్తుత రహదారి మౌలిక సదుపాయాల అప్ గ్రేడ్ అనే మూడు విభాగాలుగా వర్గీకరించబడిన పనులను చేపట్టడంలో నియమాలను పాటించాలని మంత్రి అధికారులను కోరారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రోడ్లకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలను సిద్ధం చేయడానికి కన్సల్టెంట్లను గుర్తించాలని ఆదేశించారు. అధ్వాన్నంగా ఉన్న రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద చేపట్టిన రోడ్ల పురోగతిని సమీక్షించడానికి సీనియర్ ఆర్ అండ్ బీ అధికారులతో సమావేశమైన మంత్రి.. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

# మత్తులో జోగుతున్న బాల్యం...



హైదరాబాద్,ముక్కుపచ్చలారని చిన్నారులు పట్టుతప్పుతున్నారు. మత్తులో తడబడుతున్నారు. మద్యం, మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారు. ఒక్కసారే కదా%ా% అంటూ మొదలయ్యే మత్తు అలవాటు క్రమంగా జీవితాన్ని అంధకారం చేస్తోంది. మద్యం, గంజాయి, వైట్‌నర్ తదితర వాటికి అలవాటైనవారు చదువు, ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. తల్లిదండ్రులకు మానసిక క్షోభ కలిగిస్తున్నారు. ఉన్నతస్థాయికి చేరాల్సిన బిడ్డలు డ్రగ్స్ పంజరంలో చిక్కడం చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల వెలుగుచూసిన సంఘటనలు డ్రగ్స్ బెడద తీవ్రతను కళ్లకు కడుతున్నాయి. హైదరాబాద్ నగరంలో మూడు నెలల క్రితం రూ. 8.5 కోట్ల విలువైన ఎంఫిటమైన్ మత్తుమందు దొరకడం నివ్వెరపరిచింది. చిన్నపిల్లలకు గంజాయి అలవాటుచేసి, ఆపై వారితోనే దాన్ని అమ్మిస్తున్న ముఠా యాంటీ నార్కోటిక్ సెల్‌కు పట్టుబడింది.2018 2022లో దేశవ్యాప్తంగా డ్రగ్స్ కేసుల్లో 5.13 లక్షల మంది అరెస్టు అయితే, 1.48 లక్షల మందికి మాత్రమే శిక్షలుపడ్డాయి. 2019 లో కేరళలో 4,709 కేసులు నమోదయ్యాయి. తూర్పు ఢిల్లీ పురపాలక పాఠశాల్లోని 8 నుంచి 11 ఏళ్లలోపు పిల్లల్లో ప్రతి ఆరుగురిలో ఒకరు మత్తులో జోగుతున్నారని అధికారిక అధ్యయనాలు తేల్చాయి. ఎయిమ్స్ వైద్య నిపుణుల ఆధ్వర్యంలో హైదరాబాదు, బెంగళూరు, ముంబై, లక్నో, చండీగఢ్, ఇంఫాల్ తదితర పది నగరాల్లో సాగిన సర్వేలోనూ కలవరపరిచే అంశాలెన్నో వెల్లడయ్యాయి. ఆయా ప్రాంతాల్లోని 8 నుంచి 12వ తరగతి విద్యార్థుల్లో పది శాతానికి పైగా గంజాయి, నల్లమందు, మద్యం, పొగాకుకు అలవాటుపడ్డారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీన్యాబ్) దర్యాప్తులో పలు ఉదంతాలు బయటపడ్డాయి. తాజాగా 40 వేల మందికిపైగా డ్రగ్స్ వినియోగదారులను అధికారులు గుర్తించారు. అందులో గత ఏడు నెలల కాలంలోనే సుమారు ఆరు వేల మందికి కౌన్సిలింగ్ ఇచ్చారు.మత్తు పదార్థాల సరఫరాదారులు, విక్రేతలతో పాటు వాటికి అలవాటుపడి భవిష్యత్తును పాడుచేసుకుంటున్న విద్యార్థులు, ఉద్యోగులను గుర్తించేందుకు టీజీన్యాబ్ రంగంలోకి దిగింది. పెడ్లర్ల నుంచి సేకరించిన సమాచారంతోపాటు ర్యాండమ్‌గా పరీక్షలు నిర్వహిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 40 వేల మందికిపైగా గుర్తించింది. వారికి కౌన్సిలింగ్ ఇస్తూ మత్తునుంచి బయటపడేలా తోడ్పాటునిస్తోంది. అయితే ప్రతి వంద మందిలో తొంభై మంది మిత్రుల ప్రోద్బలంతోనే మొదటిసారి గంజాయి తాగామని, తరువాత క్రమంగా అలవాటుగా మారిందని తెలిపారు. నిషేధిత ఉత్పత్తులను అలవాటు చేయడానికి, విక్రయించడానికి అసాంఘిక శక్తులు పాఠశాలలను లక్ష్యంగా చేసుకోవడంతో విద్యార్థులు నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుపోతున్నారు. మాదకద్రవ్యాలను ఉచితంగా రుచి చూపిస్తూ చిన్నారులను నెమ్మదిగా ఈ రొంపిలోకి దింపుతున్నారు. పిల్లలను క్రమేణా వాటికి బానిసలను చేసి, సరఫరాదారులుగా మార్చుతున్నారు.హైదరాబాద్‌లో 20 పాఠశాలలకు చెందిన వెయ్యి మంది విద్యార్థులు ఒక ముఠా మాయవలలో చిక్కినట్లు లోగడ వెలుగులోకి వచ్చింది. చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిది నుంచి పదో తరగతిలోపు విద్యార్థుల బ్యాగుల్లో ఈ సిగరెట్లు, మత్తు చాక్లెట్లు దొరికిన ఉదంతాలు గతంలో ఉన్నాయి. హైదరాబాద్ వంటి పలు నగరాల్లో మద్యం తాగిన అనుభూతినిచ్చే చాక్లెట్లు లభ్యమవుతున్నాయి. గంజాయితో పాటు రంగుల్లో కలిపే రసాయనాలు, జిగుర్ల వంటి వాటిని సేవిస్తూ ఎంతోమంది బాలలు తమ ఆరోగ్యాలను గుల్ల చేసుకుంటున్నారు. అబ్బాయిలతోపాటు అమ్మాయిలు కూడా ఈ మహమ్మారికి బానిసలవుతూ పట్టుబడుతున్నారు. గత ఏడాది పాఠశాల పిల్లలకు గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద లభించిన జాబితాలో 70 మంది విద్యార్థులుండగా, వారిలో 25 మంది 9, 10 శాతం ఉన్నత చదువులు, ఉద్యోగాలు చేస్తున్న యువతులు, మహిళల నంబర్లు ఉన్నాయి. నోటీసులిచ్చేందుకు ఫోన్ చేసినప్పుడు తమ బిడ్డల్ని సరిదిద్దుకునే అవకాశం ఇవ్వాలంటూ కుటుంబ సభ్యులు ప్రాధేయపడ్డారు. విషయం బయటకు పొక్కితే పరువు పోతుందనే భయంతో తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.తెలిసీ తెలియని వయసులో దుష్పరిణామాలను ఊహించలేని మనసు నిషా గుప్పిట్లో పసిడి రెక్కల బాల్యం ఛిద్రమవుతోంది. బడి పిల్లలే లక్ష్యంగా ప్రాంతాలకు అతీతంగా జడలు విప్పుకున్న నిషా వ్యాపారం తల్లిదండ్రులను వణుకుపుట్టిస్తోంది. తాము తీసుకెళ్లేది మత్త పదార్థమని వారికి తెలియదు. వాడితే కలిగే దుష్పరిణామాల గురించి ఆలోచనే లేదు. పొట్లాల్లో నింపి ఇస్తారు. చెప్పిన ప్రాంతానికి తీసుకెళ్లి ఇచ్చేస్తారు. ఇదీ నగరాల్లో గంజాయి రవాణాలో మైనర్ల పాత్ర. ఎవరికీ అనుమానం రాకుండా, పోలీసు తనిఖీలు తప్పించుకునేలా చిన్నారులతో కొంతమంది ఇలా చేయిస్తున్నారు. క్రమక్రమంగా పిల్లలు కూడా వీటికి అలవాటు పడుతున్నారు. నల్లమందు, గంజాయి, కొకైన్, ఇన్‌హ్యాలెంట్స్ (పెయింట్స్ థిన్నర్స్, డ్రైక్లీనింగ్ ఫ్లూయిడ్స్, హెయిర్ స్ప్రే, డియోడ్రెంట్స్, స్ప్రే పెయింట్స్) వాడకంలో పిల్లలు భాగస్వాములవుతున్నారు. ఇన్‌హ్యాలెంట్స్ వాడకంలో పెద్దల కంటే పిల్లలే ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది.వీటిని పెద్దల్లో 0.58%, పిల్లల్లో ఏకంగా 117% వాడుతున్నారు. పిల్లల్లో గంజాయి పీల్చుతున్న వారు 0.9% ఉంటే పెద్దల్లో 3.3% ఉన్నారు. నల్లమందు వినియోగిస్తున్న వారిలో పిల్లలు 1.8%, పెద్దలు 2.1% ఉన్నారు. మత్తుమందుల వాడకంలో పిల్లలు 0.58% ఉంటే, పెద్దలు 1.21% మంది ఉన్నారు. డ్రగ్స్ తీసుకుంటున్న వారిలో దేశంలోనే పంజాబు అగ్రస్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా గంజాయి సేవిస్తున్న వారి సంఖ్య 3.1 కోట్లు ఉంది. నల్లమందును దేశవ్యాప్తంగా 2.3 కోట్లు, మత్తుమందును 1.3 కోట్ల మంది వినియోగిస్తున్నారు. నాలుగైదు ఈశాన్య రాష్ట్రాల్లో అత్యధికంగా గంజాయి, నల్లమందు, మత్తుమందుల వాడకం తీవ్రస్థాయిలో ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మత్తుమందు తీసుకున్న వారిలో మెదడులోని న్యూక్లియర్ అకెంబెన్స్‌ను ప్రేరేపిస్తుంది. దీంతో ఎక్కడలేని సంతోషం, అవధుల్లేని ఆనందం కలుగుతుంది. మళ్లీమళ్లీ అవి కావాలని మెదడు ప్రేరేపిస్తుంది. డీఎడిక్షన్ కేంద్రాలను పటిష్టవంతం చేసి బాధితులను మామూలు వ్యక్తులుగా తీర్చిదిద్దాలి. తల్లిదండ్రులు పిల్లలపై ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తుండాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా వారిపై నిఘా వేసి ఉంచాలి. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలి.

## ప్రభుత్వ స్థలాలు కబ్జా

హైదరాబాద్,నగరంలో భూములకు బాగా డిమాండ్ ఉండటంతో ఖాళీ స్థలం కనిపిస్తే చాలా కబ్జాదారులు అక్కడ వాలిపోయి కబ్జాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే సుమారు రూ. 300 కోట్ల విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొంతమంది ప్రభుత్వ సూచిక బోర్డు ఉన్నా దానిని తొలగించి ఆ స్థలంలో షెడ్లు, టెంట్లు వేసి ప్రైవేట్ సైన్యాన్ని కాపలాపెట్టారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు.

## ఐటి చెల్లింపుదారులకు రేషన్ కట్

న్యూఢిల్లీ, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన లబ్దిదారుల్లో అనర్హులను గుర్తించే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఆదాయపు పన్ను చెల్లింపుదారుల వివరాలను ఆహార మంత్రిత్వ శాఖతో ఐటీ విభాగం పంచుకోనుంది. తద్వారా ఏరివేత పక్రియ చేపట్టే అవకాశం ఉంది. ఆదాయపు పన్ను చెల్లించని వారికి పీఎంజీకేఏవై కింద పేద కుటుంబాలకు ప్రభుత్వం ఉచిత రేషన్ అందిస్తున్న విషయం తెలిసిందే. 2024 జనవరి 1 నుంచి ఐదేళ్ల పాటు ఉచితంగా ఆహారధాన్యాలు అందించేందుకు కేంద్రం నిర్ణయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం రూ. 1.97 లక్షల కోట్లు వెచ్చించనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి తాజా బ్జడెట్‌లో రూ. 2.03 లక్షల కోట్లను ప్రతిపాదించింది. దేశంలో పెద్ద సంఖ్యలో పౌరులు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ది పొందుతున్నారు. ఇందులో కొందరు అనర్హులు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో అనర్హుల ఏరివేతకు కేంద్రం సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు తాజాగా ఓ ఆఫీసు ఆర్డర్‌ను జారీ చేసింది. ఇందులో భాగంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్.. వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆహారం, ప్రజా పంపిణీ విభాగం జాయింట్ సెక్రటరీతో సమాచారాన్ని పంచుకోనుంది. ఆధార్, పాన్, మదింపు సంవత్సరం వివరాలను సమర్పిస్తే.. నిర్ణీత మొత్తం కంటే ఆదాయం కలిగిన వారు ఉన్నవారి డేటాను డీజీఐటీ సిస్టమ్స్ అందిస్తుంది. అనర్హుల వివరాల గుర్తింపులో ఈ డేటా కీలకం కానుంది. ఈ గుర్తింపు పూర్తయ్యాక కేంద్రం తదుపరి నిర్ణయం తీసుకోనుంది.

## సంగారెడ్డిని డంపింగ్‌యార్డు చేసే కుట్ర

హైదరాబాద్, సంగారెడ్డిని మరో జవహర్‌నగర్ డంపింగ్ యార్డుగా మార్చాలని కుట్ర జరుగుతోందని భాజపా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. సంగారెడ్డి రెవెన్యూ అధికారులు, జీహెచ్ఎంసీ కలిసి అక్కడి భూములను కలుషితం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పరిశ్రమల వ్యర్థాలతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. జిన్నారం, పారా నగర్ గ్రామాలను డంపింగ్ యార్డులుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వమే చెత్తశుద్ధి కోసం 150 ఎకరాలు కేటాయించిందని అధికారులు చెబుతున్నారని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే పద్ధతుల్లో వ్యవహరిస్తోందన్నారు. రాత్రికి రాత్రే డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యక్ష పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామన్నారు. పట్టణాల చెత్తను గ్రామాలకు తరలిస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. శుద్ధి పేరుతో నల్లవల్లి ఫారెస్ట్ లో రోజుకి వంద లారీల చెత్త పోసేందుకు జిహెచ్ఎంసి ప్లాన్ చేస్తుందని విమర్శించారు. నలవల్లిలో చెత్త శుద్ధి పనులు ఆపకుంటే అధికారులకు భౌతిక దాడులు తప్పవని జీహెచ్ఎంసీకి వార్నింగ్ ఇచ్చారు. హైదరాబాద్, రంగారెడ్డి అయిపోయింది ఇప్పుడు పఠాన్ చెరువు మీద పడ్డారా?. అని ప్రశ్నించారు. పట్నం చెత్తను ప్లలెలో వేస్తానంటే ఊరుకోబోమని హెచ్చరించారు. దీన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న ప్రజా ప్రతినిధులను అడ్డుకుంటున్నారని ఫైర్ అయ్యారు. పటాన్ చెరువు ప్రాంతం ఇప్పటికే కంపెనీలతో కలుషితం అయ్యిందన్నారు. 2015 లో అప్పటి ప్రభుత్వం దీనికి పర్మిషన్ ఇచ్చిందని రెవిన్యూ అధికారులు చెప్తున్నారు. . అరెస్ట్ చేసిన నాయకులందరినీ వెంటనే విడుదల చేయాలి.. పచ్చని అడవుల్లో చెత్త వేసి భూములు కలుషితం చేస్తామంటే ఊరుకునేది లేదు. దీన్ని ఉపసంహరించుకోకుంటే నిరసనకు దిగుతాం. పోలీసులతో ప్రజలను బయటపెట్టి పనులు చేపట్టడం సరికాదు . పోలీస్ పహారాలో వేస్తున్న రోడ్లను.. చేస్తున్న పనులను వెంటనే ఆపాలి. లేదంటే ఇక్కడి నుంచి నేరుగా అక్కడికి బయల్దేరుతామని రఘునందన్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఉలిక్కిపడ్డ కాంగ్రెస్..

హైదరాబాద్,అంతా బాగుంది కానీ ఎక్కడో తేడా కొడుతుంది సీనా అన్నట్లు ఉంది కాంగ్రెస్ పార్టీ పరిస్థితి. ఓ ఇష్యూ అయిపోగానే మరో టాపిక్‌తో..అయితే అంతర్గత కుమ్ములాటలు.. లేకపోతే అపోజిషన్ ప్రెజర్‌తో సతమతం అవుతున్న కాంగ్రెస్ పార్టీకి పిడుగులాంటి వార్త గుండెలు గుభేల్ చేసిందట. అదే ఎమ్మెల్యేల సీక్రెట్ మీటింగ్. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆర్గనైజ్ చేసిన మీటింగ్‌కు పది మంది ఎమ్మెల్యేలు వెళ్లారన్న ప్రచారం కాంగ్రెస్ పెద్దలను, తెలంగాణ రాజకీయాలను మరింత ఇంట్రెస్టింగ్‌గా మార్చేశాయి.

ఆ భేటి నిజమే అంటున్న ఎమ్మెల్యేలు :

ఓ మంత్రి తీరుపై ఎమ్మెల్యేలు అసంతృప్తి రాగం వినిపించారని..దాని వెనుక ఎన్నో ఈక్వేషన్స్ ఉన్నాయని..రకరకాల ఊహాగానాలు వినిపించాయి. అయితే భేటీ అయింది నిజమేనని పలువురు ఎమ్మెల్యేలు ఓపెన్‌గానే స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ విషయంలో పీసీసీ చీఫ్ మాట్లాడిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలు తగ్గేదేలే అని చెప్పడంతో.. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షి టచ్‌లోకి వచ్చారు. తాను వచ్చే వరకు ఎక్కడా ఈ విషయం గురించి మాట్లాడొద్దని ఆమె ఎమ్మెల్యేకు సూచించారు.

ఆ జిల్లాల నేతలతో సీఎం భేటీ :

అయితే ఎమ్మెల్యేల సీక్రెట్ మీటింగ్ ఇష్యూ చర్చనీయాంశం కావడంతో కాంగ్రెస్ పెద్దలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారట. ఈ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా భేటీ అయి..అంతా సెట్ చేయాలని భావిస్తున్నారు. అందులో భాగంగానే సీఎం రేవంత్ రెడ్డి, ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌లు ఎమ్మెల్యేలతో ప్రత్యేక భేటీ కానున్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఎమ్మెల్యేలకు టైమ్ కేటాయించారు. మొదట ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలతో భేటీ కానున్నారు. ఆ తర్వాత కరీంనగర్ వరంగల్ జిల్లాల ఎమ్మెల్యేలతో చర్చిస్తారు. చివరగా మెదక్, నల్లగొండ, హైదరాబాద్, మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల ఎమ్మెల్యేలతో డిస్కస్ చేసి.. వాళ్ల ప్రాబ్లమ్స్ ఏంటో విననున్నారు.అయితే రహస్య భేటీ అయిన పది మంది ఎమ్మెల్యేలతో దీపాదాస్ మున్షి భేటీ అవుతారని నాలుగు రోజులుగా చర్చ జరుగుతోంది. కానీ పార్టీకి చెందిన అందరు ఎమ్మెల్యేలతో సమావేశం అవుతుండటం ఆసక్తి రేపుతోంది. అయితే సీక్రెట్ మీటింగ్ వెళ్లని మరికొందరు ఎమ్మెల్యేలు కూడా మంత్రుల తీరుపై అసంతృప్తిగా ఉన్నారట. తమ నియోజకవర్గ సమస్యలు చెప్పుకోవడానికి వెళ్తే టైమ్ ఇవ్వడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. అధికారులు కూడా తమ మాట వినడం లేదని ఆగ్రహంతో రలిగిపోతున్నారట హస్తం పార్టీ ఎమ్మెల్యేలు. గాంధీభవన్‌లో జరిగిన భేటీ కేసీ వేణుగోపాల్ క్లాస్ తీసుకున్నా మంత్రుల తీరులో మార్పు రావడం లేదట. అందుకే ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా భేటీ కావాలని నిర్ణయించారట.

# కేబినెట్ విస్తరణకు ముహూర్తం సిద్ధం..



హైదరాబాద్,ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూపుల్లో ఉన్న ఆ నేతలు.. ఇప్పుడు తెగ హుషారుగా ఉన్నారట. హమ్మయ్య.. ఇక ఎన్నో ఏళ్ల కల తీరబోతుందని కొందరు, మనకు ఆ ఛాన్స్ వస్తుందా అంటూ మరికొందరు ఇప్పటికే వాకబు చేసే పనిలో ఉన్నారట. ఇంతకు ఇంతలా ఆ నేతలు సంబరపడే విషయం ఏమిటంటే.. తెలంగాణ కేబినెట్ విస్తరణ.సీఎం రేవంత్ సర్కార్ ఏడాది పాలన పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఏడాది పాలన పూర్తి కాగానే కేబినెట్ విస్తరణ జరుగుతుందని జోరుగా ప్రచారం సాగింది. అయితే ప్రభుత్వం సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేసే పనిలో బిజీ కాగా, సీఎం రేవంత్ రెడ్డితో సహా మంత్రులు కూడ బిజీ అయ్యారు. దీనితో కాస్త కేబినెట్ విస్తరణ అంశం కాస్త పక్కకు వెళ్లింది. తాజాగా మరోమారు కేబినెట్ విస్తరణ ఇక ఖాయమనే వార్తలు గుప్పుమన్నాయి.గురువారం సీఎల్పీ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో పార్టీ పరమైన అంశాలపై తెలంగాణ ఇంచార్జ్ మున్షీ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హాజరై, ఎమ్మెల్యేలకు పలు సూచనలు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి అభివృద్ధి పనిని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా సూచించారు. అయితే ఇక్కడే తెలంగాణ కేబినెట్ విస్తరణకు సంబంధించి సుదీర్ఘ చర్చ సాగిందని తెలుస్తోంది.ఇప్పటికే ఆయా ఉమ్మడి జిల్లాలు, సామాజిక సమీకరణాల వారీగా ఆశావాహుల జాబితాను ఇంచార్జ్ మున్షీ సిద్ధం చేసినట్లు సమాచారం. సాయంత్రం ఢిల్లీకి మున్షీ తో పాటు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ లు వెళ్ళనున్నారు. ఈ పర్యటనలో రేపు ఏఐసీసీ అధ్యక్షులు ఖర్గే, రాహుల్ గాంధీతో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా కేబినెట్ విస్తరణ పై తగిన నిర్ణయం తీసుకొని జాబితాను కూడా ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.అందుకే ఆశావాహులు కేబినెట్ లో చోటు దక్కుతుందన్న ఆనందంలో ఉన్నారట. ఎన్నో రోజులుగా ఇదే సమయం కోసం వేచి ఉన్నామని, ఎట్టకేలకు కేబినెట్ విస్తరణలో తమకు చోటుదక్కడం ఖాయమంటూ.. అనుచరులతో చెప్పేస్తున్నారట. మరి కేబినెట్ విస్తరణ సాగితే.. ఆ అదృష్టం ఎవరికి వరించునో..!

# రాజ్యసభకు చిరంజీవి? నాగబాబుకు మళ్లీ నిరాశేనా?

అమరావతి,ఏపీ రాజకీయాల్లో బీజేపీ కీ రోల్ అవుతోంది. పార్టీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కొన్ని రాజకీయ నిర్ణయాలను ప్రభావితం చేస్తోంది. ప్రస్తుతం కూటమి భాగస్వామిగా ఉన్న బీజేపీ.. మరో మిత్రపక్షం జనసేనతో చిరకాలంగా స్నేహ సంబంధాలు కొనసాగిస్తోంది. ప్రస్తుతం టీడీపీతో పొత్తుకు కూడా జనసేన అధినేత పవన్ కల్యాణ్ కారణం కావడం తెలిసిందే. అయితే తాజాగా ఏపీ రాజకీయాల్లో ఓ కీలక పరిణామానికి బీజేపీ ప్రయత్నిస్తోందని చెబుతున్నారు. దీనిప్రకారం జనసేనాని పవన్ కల్యాణ్ సోదరుడు, మెగాస్టార్ చిరంజీవిని రాజ్యసభకు నామినేట్ చేయాలని చూస్తున్నారని సమాచారం.తెలుగు రాష్ట్రాలతోపాటు దక్షిణాదిలో మెగాస్టార్ చిరంజీవికి ఉన్న ఇమేజ్, ఆయన గ్లామర్ భవిష్యత్తులో బీజేపీ ఎదుగుదలకు ఉపయోగించుకోవాలని కమలనాథులు ప్లాన్ చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన చిరంజీవి.. ఇప్పటికీ కాంగ్రెస్ లో ఉన్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతుంటారు. అయితే ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా చిరంజీవి మాత్రం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూనే వస్తున్నారు. ఇదే సమయంలో ప్రధాని మోదీతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. గతంలో ఏపీలో అల్లూరి సీతారామరాజు శత జయంతి ఉత్సవాలు, ఆ తర్వాత కూటమి ప్రభుత్వ ప్రమాణ స్వీకారం సందర్భంగా ప్రధానితో చిరంజీవి వేదిక పంచుకున్నారు. ఇక ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంట్లో జరిగిన సంక్రాంతి సంబరాలకు ప్రత్యేక అతిథిగా వెళ్లిన చిరంజీవితో ప్రధాని మోదీ ఆత్మీయంగా వ్యవహరించడం వైరల్ అయింది.ప్రధాని మోదీతోపాటు బీజేపీ పెద్దలతో చిరంజీవికి సాన్నిహిత్యం పెరగడం, ఇటు రెండు తెలుగు రాష్ట్రాల్లో జనాకర్షణ ఉన్న నేత కోసం ఎదురుచూస్తున్న బీజేపీ.. చిరంజీవి ద్వారా ఆ లోటు పూడ్చుకోవాలని చూస్తోందని అంటున్నారు. చిరంజీవి తమతో ఉంటే రెండు తెలుగు రాష్ట్రాల్లో కాషాయ పార్టీ బలపడే అవకాశాలు ఉన్నాయని అంచనాతో చిరంజీవికి కేంద్రంలో సముచిత స్థానం కల్పించాలని భావిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా ఏపీ నుంచి రాజ్యసభకు నామినేట్ చేయాలని ప్రతిపాదిస్తోంది. అయితే జనసేన లేదంటే బీజేపీ అభ్యర్థిగా చిరంజీవిని



పరిగణించాలని కోరుతున్నారట..ప్రస్తుతం ఏపీలో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించాల్సివుంది. ఈ స్థానం నుంచి చిరంజీవి సోదరుడు, జనసేన ప్రధాన కార్యదర్శ నాగబాబును పోటీకి పెట్టాలని సీఎం చంద్రబాబు ఆలోచనగా చెబుతున్నారు. నాగబాబును మంత్రిని చేస్తానని గతంలో చంద్రబాబు ప్రకటించారు. అయితే ఆయన సేవలను ఎక్కువగా కూటమి సమన్వయానికి వాడుకోవాలని భావిస్తుండటం వల్ల రాజ్యసభకు పంపి కూటమి సమన్వయ సారథిగా నియమించాలని చంద్రబాబు ప్రతిపాదిస్తున్నారు. అయితే ఢిల్లీ పెద్దలు మాత్రం ఈ సారి నాగబాబును పక్కన పెట్టి ఆయన అన్న మెగాస్టార్ చిరంజీవిని రాజ్యసభకు పంపాలని కోరుతున్నారని తెలుస్తోంది.ప్రస్తుతం రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉన్న చిరంజీవి.. సినిమాల్లో బిజీగా ఉన్నారు. అయితే కమలం పెద్దల ప్రతిపాదనపై ఆయన ఎలాంటి స్పందన వ్యక్తం చేయలేదని అంటున్నారు. తన సోదరుడు ఆశపడుతున్న స్థానాన్ని తాను తీసుకోవడం సరికాదనే ఆలోచనలో చిరంజీవి ఉన్నట్లు తెలుస్తోంది. అయితే రెండు తెలుగు రాష్ట్రాల అవసరాల మేరకు ఆయన నిర్ణయం ఉండే అవకాశం ఉందంటున్నారు. ఏదిఏమైనా కూటమి ద్వారా పావులు కదుపుతున్న బీజేపీ.. తెలుగు రాష్ట్రాల్లో తిరుగులేని స్థానానికి చేరుకోవడం కోసం బిగ్ స్కెచ్ వేసిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# ఉత్తరాంధ్ర కొత్త బాస్ ఎవరు? రేసులో బొత్స..



అమరావతి, వైసీపీలో కొత్తగా జరుగుతున్న లుకలుకలేంటి? విజయసాయిరెడ్డి రాజీనామాతో ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ పదవి ఎవరికి దక్కుతుంది? నమ్మిన బంటును తీసుకొచ్చి జగన్ పెడతారా? ఆ ప్రాంతం వారికే ఆ పదవి అప్పగిస్తారా? ఇంతకీ జగన్ మదిలో ఏముంది? ఆ పదవికి ఎవరెవరు పోటీ పడుతున్నారు? ఎంపీ అవినాష్‌రెడ్డిని అక్కడ పెట్టాలని భావిస్తున్నారా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.వైసీపీ సభ్యత్వానికి, ఎంపీ పదవికి రాజీనామా చేశారు విజయసాయిరెడ్డి. దీంతో ఫ్యాన్ పార్టీలో ఆయన శకం ముగిసింది. ఆయన రాజీనామాతో ఉత్తరాంధ్ర నేతలు సంబరాలు చేసుకున్నారు. స్థానికేతర నాయకుడ్ని తమ నెత్తిన రుద్దుతున్నారంటూ కొందరు గుర్రుగా ఉన్నారు. సాయిరెడ్డి వెళ్లిపోవడంతో నేతలు రిలీఫ్‌గా ఫీలవుతున్నారు. ఈసారి ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ పదవి తమ ప్రాంతం వారికి దక్కుతుందనే ఆలోచనలో ఉన్నారు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నేతలు.ఈ పదవికి ఉత్తరాంధ్ర నుంచి ముగ్గురు నేతలు పోటీపడుతున్నారట. తొలుత ఈ పదవి వైవీ సుబ్బారెడ్డి అప్పగించాలని ప్లాన్ చేసిందట వైసీపీ హైకమాండ్. కాకపోతే ఉత్తరాంధ్ర నేతల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైనట్టు సమాచారం. వైవీ హయాంలో కేవలం రెండు సీట్లకు పార్టీ పరిమితమైందని, ఆయనకు ఇస్తే కేడర్ చెదిరిపోయే ప్రమాదముందని నేతలు అధిష్టానం వద్ద ప్రస్తావించారట. ఆ పదవికి ఉత్తరాంధ్ర నేతలను నియమించాలనే ఆలోచన చేస్తోంది.ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్ పదవికి ముగ్గురు నేతలు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. వారంతా మాజీ మంత్రులే కావడం గమనార్హం. ఒకరు ధర్మాన ప్రసాదరావు, మరొకరు బొత్స సత్యనారాయణ, ఇంకొకరు గుడివాడ అమర్నాథ్. తొలుత ఈ పదవిని ధర్మాన ప్రసాదరావు లేదా కృష్ణదాస్‌కు ఇవ్వాలని భావించిందట. తర్వాత ఏమైందోగానీ వెనక్కి తగ్గిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ఓటమి తర్వాత ప్రసాదరావు పార్టీలో యాక్టివ్‌గా లేరు. కేడర్‌ను పలకరించిన పాపాన పోలేదు. జగన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశాలకు, ఆందోళన కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఒకవేళ ఆ పదవి ఇచ్చినా న్యాయం చేస్తారన్న నమ్మకం నేతల్లో కనిపించలేదు.మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పేరు వెలుగులోకి వచ్చింది. తొలుత ఆయనను ఆ పదవి ఇవ్వాలని భావించినా, ఎందుకోగానీ ఆ పార్టీ వెనక్కి తగ్గిందని సమాచారం. కేవలం ప్రత్యర్థులపై విమర్శలు తప్పితే.. నేతలు, కేడర్‌తో ఆయనకు అంతగా సంబంధాలు లేవన్నది వైసీపీ అంతర్గత రిపోర్టులో తేలిందట. దీంతో ఆయన్ని పక్కన పెట్టేసినట్టు తెలుస్తోంది.ఇక మూడో వ్యక్తి మాజీ మంత్రి, మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ రేసులో ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ పదవి ఆయనకు దక్కే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో ఓటమి తర్వాత స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత మండలిలో అడుగుపెట్టడం, ప్రతిపక్ష నేతగా కేబినెట్ ర్యాంకు సొంతం చేసుకున్నారు. ఆ తరహా హోదా వైసీపీలో కేవలం బొత్సకు మాత్రమే ఉంది.బొత్స సామాజిక వర్గం విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో బలంగా ఉంది. నేతలను సమన్వయం చేసి కలిసి పని చేసిన నేతగా ముద్ర ఉంది. ఆయనకు ధీటైన నేత లేకపోవడంతో కలిసి రావడం ఖాయమని అంటున్నారు. రేపో మాపో ఉత్తర్వులు రావచ్చన్నది బొత్స మద్దతు దారుల మాట. మరి హైకమాండ్ బొత్సకు ప్రయార్టీ ఇస్తుందా?ఎలాగూ ప్రతిపక్ష నేతగా ఉండడంతో మరొకరికి ఆ పదవి ఇవ్వాలనే ఆలోచనలో ఉందా? ఇలాంటి ప్రశ్నలు ఉత్తరాంధ్ర నేతలను వెంటాడుతున్నాయి. కాకపోతే కడప ఎంపీ అవినాష్ రెడ్డికి ఇచ్చినా ఆశ్చర్యపోనకర్లేదని అంటున్నారు. గడిచిన పదేళ్లు ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ పదవిని దగ్గరవాళ్లుకు మాత్రమే ఇచ్చారు జగన్. ఇప్పుడు అవినాష్ రెడ్డికి ఇచ్చినా ఆశ్చర్యపోనకర్లేదని అంటున్నారు. మొత్తానికి ఈ గాసిప్స్‌కు తెరపడాలంటే కొద్దిరోజులు వెయిట్ చేయక తప్పదు మరీ.

# నకిలీ ఐడి కార్డుతో సచివాలయ ప్రవేశానికి యత్నం

హైదరాబాద్,తెలంగాణ సచివాలయంలోకి నకిలీ తహసీల్దార్ వెళ్లేందుకు ప్రయత్నించిన ఘటన కలకలం రేపింది. తిప్పర్తి తహసీల్దార్ అని చెప్పి అంజయ్య అనే వ్యక్తి నకిలీ ఐడీ కార్డుతో సచివాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. భద్రతా సిబ్బందికి అనుమానం వచ్చి అడ్డుకున్నారు. తిప్పర్తి ఎంఆర్‌వో కార్యాలయానికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవడంతో అంజయ్య నకిలీ తహసీల్దార్ అని తేలింది. ఎస్‌టీఎఫ్ ఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైఫాబాద్ పోలీసులు అంజయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అంజయ్య వచ్చిన వాహనంపై కూడా తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అని స్టిక్కర్ ఉండటంతో పోలీసులు కంగుతిన్నారు.

# కల్లలవుతున్న యువత డాలర్ కలలు

న్యూఢిల్లీ, యువత డాలర్ కలలు కల్లలవుతున్నాయి. అమెరికా వెళ్లి నాలుగు రాళ్లు సంపాదించుకోవాలనుకున్న వారి ఆశలు గల్లంతవుతున్నాయి. దేశంలో ఉద్యోగాలు దొరక్క, ఉపాధి దక్కక విధిలేని పరిస్థితుల్లో లక్షలాది మంది ఉద్యోగాలు, ఉపాధి వెతుక్కుంటూ అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, దుబాయ్, గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. కొందరు ఏజెంట్ల చేతిలో మోసపోతున్నారు. అమెరికా లాంటి దేశాల్లో ట్రంప్ లాంటి వారు రావడంతో తట్టుబుట్టా సర్దుకోకుండానే తిరుగు టపా కట్టాల్సి వస్తోంది. ఇలాంటి ఘటనలు కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటు. దేశంలో వనరులు ఉన్నా, చేసుకునేందుకు పనివున్నా, అవకాశాలు కల్పించకపోవడం వల్లనే ఈ దర్గతిఏర్పడుతోంది. దీనిపై పార్లమెంటు చర్చించాలి. తాజాగా మరోమారు అమెరికా కలలు కంటూ.. తమ కుటుంబాలకు మంచి జీవితం ఇద్దామనుకొని అక్కడికి వెళ్లిన వారి ఆశలు అడియాశలు లయ్యాయి. భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిపోయింది. ఈక్రమంలో వారి దీనగాథలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులను అగ్రరాజ్యం ప్రత్యేక విమానంలో వెనక్కి పంపించింది. మొత్తంగా 104 మంది ఆ విమానంలో స్వదేశానికి చేరుకున్నారు. అక్రమమార్గంలో విదేశాలకు వెళ్లొద్దని కోరుతున్నా ఆవేదన వ్యక్తంచేశారు. భారత్‌కు చెందిన 104 మంది అక్రమ వలసదారులతో అమెరికా నుంచి బయలుదేరిన సైనిక విమానం బుధవారం అమృత్‌సర్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. ఇందులో అమెరికా వెనక్కి పంపిన వారిలో 33 మంది చొప్పున హరియాణా, గుజరాత్‌ల నుంచి, 30 మంది పంజాబ్ నుంచి, ముగ్గురేసి చొప్పున మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్‌ల నుంచి, ఇద్దరు చండీగఢ్ నుంచి ఉన్నారు. అమృత్‌సర్‌కు తీసుకొచ్చిన వారిలో 19 మంది మహిళలు, 13 మంది మైనర్లు ఉన్నారు. అమృత్‌సర్‌కు చేరుకున్న అక్రమ వలసదారులను పోలీసులు తనిఖీ చేసి, వారి వివరాలను పరిశీలించాక ఇళ్లకు పంపారు .దీంతో అమెరికాలో వర్క్ వీసా ఇప్పిస్తానని నమ్మబలికిన ఏజెంట్‌కు రూ.42 లక్షలు ఇచ్చి హర్వీందర్



సింగ్ దారుణంగా మోసపోయాడు. ఆయనది పంజాబ్‌లోని హోషియాపూర్‌కు చెందిన తహ్లీ గ్రామం. తర్వాత వీసా రాలేదని చెప్పడంతో దిల్లీ నుంచి ఖతర్.. అక్కడి నుంచి బ్రెజిల్ వెళ్లి నానాయాతన పడుతూ అమెరికా వెళ్లాడు. ఇప్పుడు ట్రంప్ ఎఫెక్ట్‌తో ఉన్న డబ్బు పోయి, ఎక్కడ మొదలు పెట్టాడో అక్కడికే వచ్చి నిల్చున్నారు. దారాపూర్ గ్రామానికి చెందిన సుఖ్‌పాల్ సింగ్ కూడా ఇలాంటి దుస్థితినే ఎదుర్కొన్నారు.15 గంటల పాటు సముద్ర ప్రయాణం చేసి, దాదాపు 45 కి.మీ. పర్వతమార్గంలో ముందుకెళ్లారు. 'ఎవరైనా గాయపడితే.. వారి పరిస్థితి అంతే. మిగిలేది మరణమే. దారివెంట ఎన్నో మృతదేహాలను చూశాం. ఇక కొద్దిసేపట్లో మెక్సికో సరిహద్దు దాటి అమెరికాలో అడుగుపెడతామనగా జలంధర్‌కు చెందిన ఓ వ్యక్తి అరెస్టు కావడంతో మా ప్రయాణం అంతా వృథా అయింది. దాంతో మమ్మల్ని 14 రోజులపాటు చీకటి గదుల్లో బంధించారు. సూర్యుడు జాడే లేకుండా పోయింది. అక్కడ వేలాది మంది పంజాబీ కుటుంబాలకు చెందిన యువకులు, పిల్లలు కనిపించారు.అందరిదీ ఒక్కటే దుస్థితి. ఇలాంటి దుస్థితి ఎందుకన్నదే ప్రశ్న.మనదేశంలోనే మనం పనిచేసుకునే అవకాశా లు పెరగాలి.అప్పుడే దేశ ఆర్థిక పరిస్థితి కూడా పెరగగలదని ప్రభుత్వం గుర్తించాలి.

# ఉన్నది కాస్త ఊడింది.. ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వమంగళం పాడిన బాపు..!





హైదరాబాద్, ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ దాఖలు ప్రక్రియ మొదలైనా బీఆర్ఎస్‌లో చడీ చప్పుడూ కనిపించడం లేదు.. ఎంపీ ఎన్నికల రిజల్ట్ రిపీట్ అయితే ఉన్న కాస్త పరువు పోతుందని ఆ పార్టీ పెద్దలు భయపడుతున్నారా? అందుకే పోటీకి దూరంగా ఉంటున్నట్లు సంకేతాలు పంపుతుందా? గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి ఆశావహులు కొందరు ముందుకు వస్తున్నా వారికి సానుకూల సంకేతాలు అందుకే రావడం లేదా? ఎన్నికల్లో ఓటమి పాలైతే పార్టీ గ్రాఫ్ మరింత తగ్గిపోతుందని పోటీకి సంశయిస్తుందా?కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలతో పాటు ఖమ్మం, వరంగల్, నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి . రెండు టీచర్ ఎమ్మెల్సీ స్థానాల్లో , ఒక పట్ట భద్రుల స్థానానికి నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలైంది. ఆ ఎన్నికల్లో గులాబీ పార్టీ అభ్యర్థులను నిలబెడుతుందా? లేక ఎవరికైనా మద్దతు ఇస్తుందా అనేది చర్చగా మారింది. ఇప్పటి వరకు అభ్యర్థులను ప్రకటించకపోవడంతో అసలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తుందా లేదా అనే చర్చ బీఆర్ఎస్ వర్గాల్లో నడుస్తోంది. ఇంతకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ వ్యూహం ఏంటి అనేది రాజకీయ వర్గాలకు అంతుపట్టకుండా తయారైంది.అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలకే పరిమితమై అధికారం కోల్పోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కించుకోలేక పోవడంతో పాటు ఏకంగా సగం స్థానాల్లో డిపాజిట్లు కోల్పోవడంతో గులాబీ కేడర్ పూర్తిగా ఢీలా పడిపోయింది.ఆ తర్వాత జరిగిన ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఉప ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోలేకపోయింది. అందుకే త్వరలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టేందుకు పార్టీ పెద్దలు సంకోచిస్తున్నారంట. నాలుగు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కాంగ్రెస్ పార్టీకి సిట్టింగ్ స్థానంగా ఉంది. గత ఎన్నికల్లో జీవన్ రెడ్డి ఎమ్మెల్సీగా మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిచారు. అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉంది.అయితే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారికంగా అభ్యర్థిని నిలబెట్టలేదు. అప్పట్లో వేరే అభ్యర్థికి మద్దతు ఇచ్చింది. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి వ్యూహాలు అనుసరిస్తుంది అనేది చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో బీఆర్ఎస్ టికెట్ కోసం నేతలు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ చిలుముల రాకేష్ కుమార్, టీఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవీప్రసాద్, ప్రయివేటు విద్యాసంస్థల సంఘం నేత శేఖర్‌రావు టిక్కెట్ ఆశిస్తున్నారు. వారు కేసీఆర్ ను కలిసి తమకు పోటీ చేసే అవకాశం కల్పించాలని ఇప్పటికే కోరారు.ఇక కరీంనగర్, నిజామాబాద్ , మెదక్, ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి గతంలో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పాతూరి సుధాకర్ రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. అధికారంలో ఉన్నప్పుడే ఓడిపోయిన ఆ స్థానం నుంచి ఇప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థి రంగంలోకి దిగడం అనమానమే అంటున్నారు. ఖమ్మం, వరంగల్ , నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గతంలో పిఆర్‌టియూ నుండి గెలిచిన పూల రవీందర్ బీఆర్ఎస్‌లో చేరారు. గత ఎన్నికల్లో బిఆర్ఎస్ నుండి పోటీ చేసిన పూల రవీందర్ పరాజయం పాలయ్యారు. దాంతో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారికంగా అభ్యర్థులను నిలబెడుతుందా లేదా అన్నది క్లారిటీ లేకుండా పోయింది.ఎన్నికల్లో పోటీపై గులాబీ పార్టీ ముఖ్య నేతలు సైలెంట్ గా ఉంటున్నారు. బీజేపీ మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో తమ అభ్యర్థులను ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ సైతం తమ అభ్యర్థులపై కసరత్తులు చేస్తోంది. మెదక్ , కరీంనగర్ , నిజామాబాద్ , ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ అభ్యర్థిని ప్రకటించింది .. ఇక కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం పరిధిలోనే కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. కవిత ఎమ్మెల్సీగా అక్కడ నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయినా ఈ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్ సంశయిస్తుండటం ఆ పార్టీ దైన్య స్థితికి అద్దం పడుతోందంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏడాదిలోనే ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోయిందని బీఆర్ఎస్ ఉదరగొడుతుంది. అయినా ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండటంతో.. కేసీఆర్ వ్యవహా శైలిలో ఇంక మర్పురాలేదని, అదే ఒంటెద్దు పోకడ పోతున్నారని గులాబీ శ్రేణులు గుర్రుగా కనిపిస్తున్నాయి.

# చేతులెత్తేసిన జెన్‌కో.. ప్రైవేట్‌కు బ్యాటరీ స్టోరేజీ ప్లాంట్

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో ఏర్పాటు చేయాల్సిన అతిపెద్ద బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్‌పై జెన్‌కో చేతులెత్తేసింది. (బిల్డ్-ఆపరేట్-ఓన్) పద్ధతిలో ఆ ప్లాంట్‌ను సొంతంగా ఏర్పాటు చేయాల్సిన జెన్‌కో పూర్తిగా అస్త్రసన్యాసం చేసింది. ఆ ప్లాంట్‌ను బడాబాబులకు అప్పగించించేందుకు టెండర్లను ఆహ్వానించింది. గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ ప్లాంట్ ఏర్పాటుకయ్యే రూ.600 కోట్ల అంచనా వ్యయంలో 40% మొత్తాన్ని (రూ.240 కోట్లు) వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) కింద అందజేస్తుంది. మిగిలిన 60% మొత్తాన్ని (రూ.360 కోట్లు) జెన్‌కో పెట్టుబడిగా పెడితే సరిపోతుంది. అయినప్పటికీ కేంద్ర సాయాన్ని అందిపుచ్చుకోకుండా ఆ ప్లాంట్‌ను ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు జెన్‌కో రంగం సిద్ధం చేసింది. దీంతో కేంద్రం అందించే రూ.240 కోట్లు ప్రైవేట్ వ్యక్తులకు దక్కనున్నాయి.

**విద్యుత్తు జెన్‌కోదే.. అమ్మేదీ జెన్‌కోకే**

విచిత్రమేమిటంటే ఈ ప్లాంట్‌లో నిల్వచేసే విద్యుత్తు జెన్‌కోదే. డిమాండ్ లేనప్పుడు జెన్‌కో నుంచి తక్కువ ధరకు విద్యుత్తు కొనుగోలుచేసి ఈ ప్లాంట్‌లోని బ్యాటరీల్లో నిల్వచేస్తారు. డిమాండ్ పెరిగినప్పుడు ఆ విద్యుత్తును మళ్లీ జెన్‌కోకే విక్రయిస్తారు. ఈ ప్లాంట్ జీవితకాలాన్ని 25 ఏండ్లుగా నిర్ణయించారు. అంటే.. ఈ ప్లాంట్‌ను ఏర్పాటుచేసే ప్రైవేట్ సంస్థ 25 ఏండ్లపాటు జెన్‌కో నుంచి విద్యుత్తు కొనుగోలు చేసి, బ్యాటరీల్లో నిల్వ చేస్తుంది. ఆ విద్యుత్తునే మళ్లీ జెన్‌కోకు విక్రయించి సొమ్ము చేసుకుంటుంది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన జెన్‌కో వార్షిక టర్నోవర్ రూ.15 వేలకోట్ల పైమాటే. అలాంటి సంస్థ బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కేవలం రూ.360 కోట్లు పెట్టుబడిగా పెట్టలేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై జెన్‌కోతోపాటు ప్రభుత్వం పునరాలోచించాలని విద్యు త్తు రంగ నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.



**అస్మదీయుల కోసమేనా?**

బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటును ప్రైవేట్ సంస్థకు అప్పగించేందుకు టెండర్లు పిలవడం వెనుక భారీ కుంభకోణం ఉన్నదని, వీజీఎఫ్‌గా సమకూరే రూ.240 కోట్లతోపాటు జెన్‌కోకు చెందిన 70 ఎకరాల స్థలాన్ని అస్మదీయులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వ పెద్దలు కుట్ర చేశారని, అందుకే ఉద్దేశపూర్వకంగా జెన్‌ను తప్పించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. శంకర్‌పల్లిలో గ్యాస్ ఆధారిత విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు కోసం గతంలో స్థల సేకరణ జరిపారు. కానీ, ఆ ప్లాంట్ ఏర్పాటులో ముందడుగు పడలేదు. జెన్‌కో నిర్లక్ష్యం వల్ల ఆ స్థలంలో ఇప్పటికే కొంత భాగం కబ్జాకు గురైంది. మిగిలిన స్థలంలో బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే అదికూడా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. దీన్ని జెన్‌కో ఇంజినీర్లు, ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్‌ను సొంతంగా జెన్‌కో నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com